జాయిస్ మేయర్

# విరిగిన హృదయాలను స్వస్థపరచుట



దేవుని వాక్యంలోని శక్తిద్వారా పునరుద్ధరించబడుట

# విరిగిన హృదయాలను
# స్వస్థపరచుట

# విరిగిన హృదయాలను స్వస్థపరచుట

## దేవుని వాక్యంలోని శక్తిద్వారా
## పునరుద్ధరించబడుట

జాయిస్ మేయర్

JOYCE MEYER
MINISTRIES®
Sharing Christ – Loving People

Post Bag No. 1, Jubilee Hills, Hyderabad - 500 033

Unless otherwise indicated, all Scripture quotations are taken from the *The Amplified Bible* (AMP). *The Amplified Bible, Old Testament* copyright © 1965, 1987 by The Zondervan Corporation. *The Amplified New Testament,* copyright © 1954, 1958, 1987 by The Lockman Foundation. Used by permission.

Copyright © 2018 by Joyce Meyer Ministries - Asia

All rights reserved. No part of this publication may be reproduced, distributed, or transmitted in any form or by any means, or stored in a database or retrieval system, without the prior written permission of Joyce Meyer Ministries - Asia.

Joyce Meyer Ministries - Asia
Post Bag No. 1, Jubilee Hills,
Hyderabad - 500 033

Phone: +91-40-2300 6777
Website: www.jmmindia.org

Healing the Brokenhearted - *Telugu (R1 - 2018)*
*Experience Restoration Through the Power of God's Word*

*Printed at:*
Caxton Offset Pvt. Ltd.
Hyderabad - 500 004

# విషయ సూచిక

ఉపోద్ఘాతం: దేవుని వాక్యము vii

1 దేవుని ప్రేమ అనుభవించుట 1

2 నీ భవిష్యత్ పట్ల నిశ్చయత 11

3 క్రీస్తు యందు నీ నీతిని తెలుసుకొనుట 21

4 నీ జీవితములో నున్న భయమును అధిగమించుట 33

ముగింపు: నిలకడగా ఉండు! 43

లేఖనాల ఒప్పుకోళ్ళు 45

- ఉపోద్ఘాతము: దేవుని వాక్యము 45
- దేవుని ప్రేమ 46
- నీ భవిష్యత్ 51
- క్రీస్తుయందు నీ నీతి 55
- భయమును అధిగమించుట 59
- నిలకడగా వుండు 63

గ్రంథ ఆధారాలు 64

రక్షణ కొరకు ప్రార్థన 65

రచయితను గురించి 67

# ఉపోద్ఘాతం:
# దేవుని వాక్యము

❤ "ఆయన తన వాక్కును పంపి వారిని బాగు చేసెను. ఆయన వారు పడిన గుంటలలోనుండి వారిని విడిపించెను."

కీర్తనలు 107:20

దేవుని వాక్యము మనలను స్వస్థపరచి రక్షించును. మనలను మన జీవితాలను కూడా అది మార్చును.

దేవుని వాక్యము నిన్ను మార్చును.

దివారాత్రము దేవుని వాక్యమును ధ్యానించు వ్యక్తి ఫలమిచ్చు చెట్టువలె నుండి అతడు చేయునదంతయు సఫలమగునని దావీదు కీర్తనలు 1:1-3లో తెలిపినాడు.

స్థిరముగా నాటబడుట అనగా నిలకడగా ఉండుట. నీవు నిలకడగా వుండినప్పుడు నీవు చేయునదంతయు సఫలమగును. దానికి మార్గము దేవుని వాక్యమును ధ్యానించుట.

వాక్యమును ధ్యానించుట అనగా దానిని మనస్సులో పదే పదే నెమరు వేసుకొనుట, యోచించుట, ఆలోచన చేయుట. మరియు తన సేవకుడైన యెహోషువాకు ఆజ్ఞాపించిన రీతిగా దానిని నీకు నీవు అన్వయించుకొనుట.

> ❤ ఈ ధర్మశాస్త్ర గ్రంథమును నీవు బోధింపక తప్పిపోకూడదు. దానిలో వ్రాయబడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దాని ధ్యానించిన యెడల నీ మార్గము వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు.
>
> యెహోషువా 1:8

ద్వితీ. 30:14లో ❤ "నీవు దాని అనుసరించుటకు ఆ మాట నీకు బహు సమీపముగానున్నది; నీ హృదయమున నీ నోట ఉన్నదని" చెప్పబడినది.

యెషయా 55:11 నందు ప్రభువు మనకు వాగ్దానము చేయుచున్నాడు. ❤ "నిష్ఫలముగా నాయొద్దకు మరలక అది నాకు అనుకూలమైనదాని నెరవేర్చును నేను పంపిన కార్యమును సఫలము చేయును".

"వాక్యమందు దేవుని మహిమను చూచుచుండగా మనము ఆయన పోలికలోనికి మార్చబడుచున్నామని పౌలు 2 కొరింథీ. 3:18లో బోధించు చున్నాడు" దేవుడు మనపట్ల కలిగియున్న అద్భుత ప్రణాళికను చూచుట, నమ్ముట అనునవి ప్రభువు మహిమను చూచుటలో భాగము.

దేవుడు మనలను ప్రేమించుచున్నాడు మరియు మన జీవితాలపట్ల మంచి అద్భుతమైన సంకల్పము కలిగియున్నాడు. దేవుడు తన ప్రగాఢ ప్రేమను తృప్తి పరచుకొనే నిమిత్తము క్రీస్తు ద్వారా రక్షణ అను ప్రణాళికను దేవుడు సిద్ధపరచెనని పౌలు ఎఫెసీ పత్రిక మొదటి అధ్యాయములో చెప్పుచున్నాడు.

దేవుడు నిన్ను ప్రేమించుచున్నాడని, నీ పట్ల, నీ జీవితము పట్ల ఆశ్చర్యకరమైన,

మహిమకరమైన ప్రణాళిక కలిగియున్నాడని దీని అర్థము. దానిని నమ్మి నీవు ఒప్పుకొనవలెను.

దేవుని ప్రణాళిక చెరుపు యత్నము అపవాది చేయుచున్నది.

నీవు అయోగ్యుడవని నిరూపించుటకు వాడు ఎంతో శ్రమపడుచున్నాడు. ఎందుకు? ఎందుకంటే నీవు దేవుని చేత ప్రియముగా ప్రేమించబడుచున్నావు అని నీవు విశ్వసించుట వాడికిష్టము లేదు. దైవ వాక్యము పదే పదే వినుట ద్వారా అది నీ అంతరంగ జీవితములో అనగా నీ ఆలోచన పద్ధతిలో భాగమైతే అది నీ జీవితాన్ని మార్చునన్న విషయము అపవాదికి తెలుసు. అలా జరుగుట వాడికిష్టముండదు.

అందుచేతనే నేను ఈ పుస్తకాన్ని వ్రాసినాను. నీ స్వరూపాన్ని మరియు నీ వర్తమాన భవిష్యత్‌ను మార్చగల శక్తి లేఖనాలు కలిగియున్నవని నేను నమ్ముచున్నాను.

బైబిలు ప్రకారము నీవు దేవుని స్వరూపమందు సృజింపబడినావు (ఆది. 1:27). “నిన్ను గూర్చి దేవుడు ఏమి చెప్పుచున్నాడో దానిని విశ్వసించుట నీ వైఖరిని, అభిప్రాయాన్ని మార్చుతుంది. ఈ ప్రశ్నలు నీకు నీవు వేసుకో నన్ను గూర్చి నేనేమి అనుకొనుచున్నాను? నన్ను గూర్చి నా అభిప్రాయమేమిటి?” నిన్ను నీవు ఈ ప్రశ్నలు కూడా వేసుకో “దేవుడు నన్ను గూర్చి ఏమి యోచించుచున్నాడు, నన్ను గూర్చి దేవుని అభిప్రాయం ఏమిటి?”

దేవుడు నిన్ను గూర్చి యోచించునది, చెప్పుచున్నది లేఖనములో కనబడుచున్నది. ఈ పుస్తకములో ఉన్న లేఖనాలు నీ నోటితో ఒప్పుకొనుట అనునది శత్రువుతో కాక, దేవునితో నిన్ను ఒక ఒప్పందానికి నడిపిస్తుంది. జీవితమంతా ఆయన యందు విశ్వసించినావు. అది అబద్ధమని అపవాది బహుశా నీతో చెప్పియుండవచ్చు. అలాగయితే ఇప్పుడు దేవుని విశ్వసించు సమయము.

నీ వాక్యము సత్యమని యోహాను 17:17లో యేసు చెప్పినాడు. సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని యోహాను 8:32లో యేసే చెప్పినాడు. సత్యమైన దైవ వాక్కు మనలను స్వతంత్రులనుగా చేయుటయేకాక మన బాహ్య దృష్టిని, స్వభావాన్ని కూడా మార్చి వేయును. అందు నిమిత్తమే దానిని చదివి అధ్యయనము చేసి మన అంతరంగములోకి చొచ్చుకు పోవునట్లుగా దానిని ధ్యానించాలి.

దేవుని ముఖమును వెతుకు నీవు ఆయన స్నేహితునిగా, నమ్మకమైన వానిగా, జయశీలుడుగా, సంపూర్ణ ఆనందాన్ని పొందువానిగా, విశ్వసనీయుడుగా నీవు క్రీస్తు నందుండగలవు.

నిన్ను గూర్చి వాక్యమందు దేవుడేమి చెప్పినాడో దానిని ఒప్పుకో. నీవు అలా చేయునప్పుడు, దేవుడు నీ జీవితములో క్రియ చేయనారంభిస్తాడు. నలిగిన, గాయపరచబడిన మరియు భయస్థుడుగా ఉన్న నిన్ను దేవుని ప్రేమించే నమ్మకమైన స్నేహితునిగా ఆయన మార్చును.

యెషయా 61:1-3లో ఇలా వ్రాయబడివున్నది:

> ❤ ప్రభువగు యెహోవా ఆత్మ నా మీదకి వచ్చియున్నది. దీనులకు సువర్తమానము ప్రకటించుటకు యెహోవా నన్ను అభిషేకించెను. నలిగిన హృదయముగలవారిని దృఢ పరచుటకును చెరలోనున్నవారికి విడుదలను బంధింపబడిన వారికి విముక్తిని ప్రకటించుటకును.
>
> యెహోవా హితవత్సరమును మన దేవుని ప్రతిదండన దినమును ప్రకటించుటకును దుఃఖాక్రాంతులందరిని ఓదార్చుటకును సీయోనులో దుఃఖించువారికి (ఉల్లాస వస్త్రములు) ధరింప జేయుటకును.

> బూడిదెకు ప్రతిగా పూదండను దుఃఖమునకు ప్రతిగా ఆనందతైలమును భారభరితమైన ఆత్మకు ప్రతిగా స్తుతివస్త్రమును వారికిచ్చుటకును ఆయన నన్ను పంపియున్నాడు. యెహోవా తన్ను మహిమ పరచుకొనునట్లు నీతి అను మస్తకి వృక్షములనియు యెహోవా నాటిన చెట్లనియు వారికి పేరు పెట్టబడును.

అవును దేవుడు నిన్ను, నీ స్వభావాన్ని మార్చుచున్నాడు. నీ జీవితాన్ని మార్చుచున్నాడు. దేవుడు నిన్ను ప్రేమించుచున్నాడు. నీవు ప్రత్యేకమైన వ్యక్తివి. దేవుడు నిన్ను ప్రేమించుచున్నాడన్న భావన శత్రువు కలుగనివ్వడు. అయినను దేవుడు ప్రేమించుచున్నాడు.

దైవప్రేమ నిశ్చయత ఎలా కలిగియుండాలో నేర్చుకొనుటయేకాక, భవిష్యత్‌పట్ల నిశ్చయత ఎలా కలిగియుండాలో, నీ నీతిని తెలుసుకొనుట ఎలా (క్రీస్తు నందు నీవెవరవు) మరియు దేవుడు నీ జీవితములో కుమ్మరించాలనుకున్న ఆశీర్వాదములను దొంగిలించు భయాన్ని కూడా ఎలా అధిగమించాలో అను విషయాలను ముందున్న పాఠాలలో నేర్చుకొనెదవు.

ఆయన పంపిన కార్యము సఫలము చేయుచు, నిష్ఫలముగా ఆయన యొద్దకు తిరిగిరాని వాక్యాన్ని మాట్లాడు, నేర్చుకొనుచుండగా దేవుడు నిన్ను దీవించునుగాక!

# 1

# దేవుని ప్రేమ అనుభవించుట

❤ అయినను మనలను ప్రేమించినవాని ద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము.

మరణమైనను జీవమైనను దేవదూతలైనను ప్రధానులైనను ఉన్నవియైనను రాబోవునవియైనను అధికారులైనను

ఎత్తయినను లోతైనను, సృష్టింపబడిన మరి ఏదైనను, మన ప్రభువైన క్రీస్తుయేసునందలి దేవుని ప్రేమనుండి మనలను ఎడబాప నేరవని రూఢిగా నమ్ముచున్నాను.

రోమా 8:37-39

ఈ జీవితములో మనకు వ్యతిరేకముగా ఏమి వచ్చినప్పటికిని మనలను ప్రేమించి, తన జీవమును మనకిచ్చుటకు సిద్ధపడిన క్రీస్తు ద్వారా మనకు విజయము లభించునని పౌలు ఈ లేఖనమందు అభయమిచ్చుచున్నాడు.

యోహాను 3:16లో యేసే ఇలా అంటున్నాడు. ❤ “దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను, కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన

వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను".

దేవుడు నిన్ను ఎంతగా ప్రేమించినాడంటే, భూలోకములో నీవు ఒక్కడవే ఉన్నను వ్యక్తిగతంగా నీ కొరకు ప్రాణమిచ్చునంతగా ఆయన నిన్ను ప్రేమించుచున్నాడు.

యేసు ప్రియ శిష్యుడైన యోహాను దానిని ఇలా చెప్పుచున్నాడు. ప్రేమలో భయముండదు (భయము ఉనికి లేదు) అంతేకాదు పరిపూర్ణ (సంపూర్ణ) ప్రేమ భయమును వెళ్ళగొట్టును భయము దండముతో కూడినది. భయపడువాడు ప్రేమయందు పరిపూర్ణము చేయబడిన వాడు కాడు. (1 యోహాను 4:18)

మన హృదయములో భయమున్నదంటే ఆయన ప్రేమను గూర్చిన జ్ఞానము మనలో ఇంకా కొదువుగా నున్నదని చెప్పుటకు అది నిదర్శనము.

దేవుని ప్రేమ యొక్క గొప్పతనాన్ని నీవు గ్రహిస్తే అది నీలోనున్న భయాలను పారద్రోలుతుంది.

❤ "మీరు నన్ను ప్రేమించి, నేను దేవుని యొద్ద నుండి బయలుదేరి వచ్చితినని నమ్మితిరి గనుక తండ్రి తానే మిమ్మును ప్రేమించుచున్నాడని" యేసు యోహాను 16:27లో చెప్పినాడు.

దేవుడు మనపట్ల ఎంతో శ్రద్ధ కలిగియున్నాడని విశ్వసించుట కష్టమా?

నేను దేవుని ప్రేమను పొందుకొనుటకు తగిన వ్యక్తిగా ఉండాలన్న తలంపుతో అనేక సం॥ల వరకు ఆయన ప్రేమను పొందుకొనలేకపోయినాను. అయితే నాలో ఇంకా అపరిపూర్ణతలు వున్నను ఇప్పుడు ఆయన నన్ను ప్రేమించుచున్నట్లు తెలుసుకొన్నాను. నేను పరిపూర్ణురాలను కాకపోయినను ఆయన నన్ను ప్రేమిస్తున్నాడన్న విషయము ఇప్పుడు నాకు తెలుసు.

❤ "నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించువాడు; నన్ను ప్రేమించువాడు నా తండ్రి వలన ప్రేమింపబడును: నేను వానిని ప్రేమించి, వారికి నన్ను కనబరచుకొందునని" యోహాను 14:21లో చెప్పుచున్నాడు.

యేసు తన వాస్తవికతను నీకు నిరూపించాలని ఆశించుచున్నాడు.

విధేయత నిజమైన ప్రేమఫలము. అయితే ఆయన ప్రేమను నీవు ముందు పొందుకొనలేకపోతే ఆయనను ప్రేమించలేవు. దానిని నీవు ఆర్జించలేవు మరియు సత్క్రియల ద్వారా కాని మంచి ప్రవర్తన ద్వారా కాని నీవు దానిని కొనలేవు.

దైవప్రేమ ఉచిత బహుమానము, అది షరతులు లేనిది క్రీస్తు సిలువ మరణ త్యాగమును బట్టి దానిని మనము పొందుకొనుచున్నాము.

ఇప్పుడే ఆ దేవుని ప్రేమను పొందుకో "దేవా నీవు నన్ను ప్రేమించుచున్నావని నమ్ముచు ఆ ప్రేమను స్వీకరించుచున్నాను" అని ఇప్పుడే దేవుని సన్నిధిలో కూర్చొని చెప్పు.

❤ "ఆయన మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నామని" 1 యోహాను 4:19లో వ్రాయబడినది. నేను చాలా సంవత్సరాల క్రితము చేసిన విధముగా బహుశా నీవు కూడా వెనుకంజ వేయుచున్నావేమో. దేవుడు నిన్ను తిరిగి ప్రేమించాలన్న ఉద్దేశముతో ఆయనను నీవు ఎక్కువగా ప్రేమించుటకు ప్రయత్నము చేస్తుండవచ్చు. మరల 1 యోహాను 4:19 చదవండి. ❤ "ఆయన మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము."

కీర్తనలు 36:7లో దావీదు దేవుని ప్రేమను గూర్చి నమ్మకంగా ఇలా చెప్పుచున్నాడు- ❤ "దేవా నీ కృపయెంతో అమూల్యమైనది. నరులు నీ రెక్కల నీడను ఆశ్రయించుచున్నారు. 139వ కీర్తనలో వున్న వాక్యభాగాలు

మీతో పంచుకోవాలని ఇష్టపడుచున్నాను. దావీదు దేవునితో సంభాషించు విధము చాలా ప్రత్యేకమైనది. ఆ మాదిరి అనుసరించుటకు ప్రయత్నించుదము. ఈ కీర్తనలోని మాటలు నీ నోటితో ఒప్పుకొనుము."

> ❤ "యెహోవా నీవు నన్ను పరిశోధించి తెలిసికొనియున్నావు" నేను కూర్చుండుట, నేను లేచుట నీకు తెలియును. నాకు తలంపు పుట్టకమునుపే నీవు నా మనస్సును గ్రహించుచున్నావు. నా నడకను, నా పడకను నీవు పరిశీలన చేసియున్నావు. నా చర్యలన్నింటిని నీవు బాగుగా తెలిసికొనియున్నావు. యెహోవా మాట నా నాలుకకు రాకమునుపే అది నీకు పూర్తిగా తెలిసియున్నది. వెనుకను, ముందును నీవు నన్ను ఆవరించి యున్నావు నీ చేయి నా మీద వుంచి యున్నావు. ఇట్టి తెలివి నాకు మించినది అది అగోచరము అది నాకందదు నీ ఆత్మ యొద్ద నుండి నేనెక్కడికి పారిపోవుదును? నీ సన్నిధి నుండి నేనెక్కడికి పోవుదును?
>
> దేవా, నీ తలంపులు నాకెంత ప్రియమైనవి వాటి మొత్తమెంత గొప్పది.
>
> వాటిని లెక్కించెద ననుకొంటినా అవి యిసుక కంటెను లెక్కకు ఎక్కువై యున్నవి.
>
> కీర్తనలు 139:1-7,17,18

ఇది శక్తివంతమైనది!

మనకు మంచి చేయుటకు దేవుడు వేచియున్నాడని ప్రవక్తయైన యెషయా తెలియచేయుచున్నాడు. ❤ "కావున మీయందు దయ చూపవలెనని యెహోవా ఆలస్యము చేయుచున్నాడు. మిమ్మును కరుణింపవలెనని ఆయన

నిలువబడియున్నాడు. యెహోవా న్యాయము తీర్చు దేవుడు ఆయన నిమిత్తము కనిపెట్టుకొనువారందరు ధన్యులు. (అనగా ఆయన విజయము, దయ, ప్రేమ, సమాధానము సంతోషము సాటిలేని మరియు వీడని ఆయన స్నేహము)!” (యెషయా 30:18).

నీవు ప్రత్యేకమైన వాడవు మరియు ఆయన నిన్ను ప్రేమించుచున్నాడు కనుక నీతో ఆయన సమయము గడపాలని కోరుకొనుచున్నాడు.

ఆయన నిన్ను ప్రేమించుచున్నాడు. గనుక నీ సంచారములను ఆయన లెక్కించుచున్నాడు. ఆయన నీ కన్నీళ్ళు తన బుడ్డిలో నుంచియున్నాడు అవి తన కవిలెలో కనబడును గదా! (కీర్తనలు 56:8)

యోహాను 14:18లో ❤ “మిమ్మును అనాథలనుగా (ఆదరణ లేనివారుగా, ఒంటరిగా, దుఃఖితులుగా, దిక్కులేనివారుగా మరియు నిస్సహాయులుగా) విడువను, మీ యొద్దకు వత్తును” అని యేసు శిష్యులతో అన్నాడు.

❤ “నా తల్లిదండ్రులు నన్ను విడిచినను యెహోవా నన్ను చేరదీయును” అని దావీదు కీర్తనలు 27:10లో చెప్పుచున్నాడు.

ప్రతివ్యక్తి కోరుకొనే స్వాభావిక ప్రేమ నీకు ఒకవేళ కొదువుగా వుండవచ్చు. బహుశా నీ సొంత కుటుంబమే నిన్ను విడిచియుండవచ్చు. ఇతరుల ప్రేమ నీవు కోల్పోయినను బలమైన శక్తిగల దేవుని ప్రేమ దానిని తిరిగి ఇవ్వగలదని నీవు గ్రహించాలని దేవుడు కోరుకొనుచున్నాడు. ఆయన నిన్ను ఆదరించి నీ నలిగిన హృదయాన్ని కట్టనిమ్ము (స్వస్థపరచనివ్వు).

నీవు దేవుని కుటుంబములోకి చేర్చబడినావు. నీవు ఆయన బిడ్డవు ఆయన నిన్ను ప్రేమించుచున్నాడు.

ఎఫెసీ. 3:17-19లో అపొస్తలుడైన పౌలు మనందరి నిమిత్తము ఇలాగు ప్రార్థించినాడు.

❤ క్రీస్తు మీ హృదయములలో (వాస్తవంగా) విశ్వాసముద్వారా నివసించునట్లుగాను (స్థిరపడి), ఏకమై, శాశ్వత నివాసము ఏర్పరచునట్లుగా)

తన మహిమైశ్వర్యముచొప్పున మీకు దయచేయవలెననియు, మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా, ప్రేమ యందు వేరు పారి స్థిరపడి, సమస్త పరిశుద్ధులతో (దేవుని ప్రేమ అనుభవించిన దైవజనులతో) కూడా దాని వెడల్పు పొడుగు లోతు ఎత్తు ఎంతో గ్రహించుకొనుటకును.

జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును (ఆచరణాత్మకముగా అనుభవించుట) తగిన శక్తి గలవారు కావలెననియు ప్రార్థించుచున్నాను.

అవును దేవుడు నిన్ను ప్రేమించుచున్నాడు. మరియు ఆయన నిన్ను గమనించుచున్నాడు గనుక అన్ని సమయములయందు ఆయన నీ మీద దృష్టి కలిగియున్నాడు. యెషయా 49:16లో "చూడుము నా అరచేతుల మీద నిన్ను చెక్కియున్నానని" అంటున్నాడు.

❤ "తండ్రి ఎలాగు నన్ను ప్రేమించెనో నేనును మిమ్మును అలాగే ప్రేమించితిని, నా ప్రేమ యందు నిలిచియుండుడని యేసు" యోహాను 15:9లో చెప్పుచున్నాడు.

దేవుడు నిన్ను ఎంతగా ప్రేమించుచున్నాడు?

❤ "తన స్నేహితులకొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేడు" (యోహాను 15:13) దానిని మించిన ప్రేమ మరెవ్వరు చూపలేరు (కలిగి యుండలేరు).

నీ స్నేహితునిగా ఉండాలని యేసు ఆశించుచున్నాడు ఆయన ఎంతగా నిన్ను ప్రేమించుచున్నాడో చూపుటకు తన ప్రాణాన్ని కూడా త్యాగము చేసినాడు.

❤ "ఏలయనగా మనమింకను బలహీనులమై యుండగా, క్రీస్తు యుక్తకాలమున భక్తిహీనులకొరకు (పక్షమున) చనిపోయెను" అను విషయాన్ని పౌలు రోమా 5:6లో గుర్తుచేయుచున్నాడు.

తగిన కాలములో మనమింకను పాపులమై యుండగా, దేవుడు క్రీస్తును పంపుట ద్వారా తన గొప్ప ప్రేమను వెల్లడి పరచుకొనినాడు.

తరువాత 7వ వచనములో పౌలు చెప్పుచున్నాడు, ❤ "నీతిమంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు, మంచివాని కొరకు ఎవడైన ఒకవేళ చనిపోవ తెగింపవచ్చునని" 8వ వచనములో పౌలు చెప్పుచున్నాడు. ❤ అయితే దేవుడు మన యెడల తన ప్రేమ వెల్లడి పరచుచున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగా క్రీస్తు మనకొరకు చనిపోయెనని చెప్పుచు 8వ వచనములో పౌలు తన ముగింపును ఇచ్చుచున్నాడు.

నా స్నేహితుడా, దేవుడు నిన్ను ఎంతగానో ప్రేమించుచున్నాడు. దేవుని ప్రేమను పరిశుద్ధాత్మ బయలుపరచుటకు ప్రయత్నించుచున్నాడు. నీ హృదయము తెరచి దైవ ప్రేమను స్వీకరించు. నీవున్న చోటనే ఆయన నిన్ను అంగీకరించుచున్నాడు. ఆయన నిన్ను తిరస్కరించడు. నీకు శిక్ష విధించడు. (యోహాను 3:18)

ప్రియమైన క్రీస్తుయేసు ద్వారా మనలను కుమారులుగా స్వీకరించుటకు దేవునికి ఇష్టమేనని పౌలు ఎఫెసీ. 1:6లో చెప్పుచున్నాడు. మన సొంత సామర్ధ్యము ద్వారా మనము పరిపూర్ణులుగా అంగీకరించబడము కాని క్రీస్తు ద్వారా నీతిమంతులుగా తీర్చబడి తండ్రి యొద్దకు వెళ్లగలమని చెప్పుచున్నాడు.

మనయెడల ఆయన కృప అద్భుతమైనదని బైబిలు ఎఫెసీ. 1:7లో చెప్పుచున్నది. ❤ "దేవుని కృపామహాదైశ్వర్యమునుబట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది".

❤ "పర్వతములు తొలగిపోయినను మెట్టలు తత్తరిల్లినను నా కృప నిన్ను విడిచిపోదు సమాధానవిషయమైన నా నిబంధన తొలగిపోదు అని నీయందు జాలిపడు యెహోవా సెలవిచ్చుచున్నాడు" అని యెషయా 54:10లో చెప్పబడినది.

❤ మన దేవుడు నమ్మతగినవాడు (ఆధారభూతుడు, విశ్వసనీయుడు, కనుక వాగ్దాన విషయములో తప్పిపోడు ఆయన మీద ఆధారపడవచ్చు) అని పౌలు 1 కొరింథీ. 1:9లో గుర్తుచేయుచున్నాడు. నీవు ఆయన యందు విశ్వసించినంతకాలము నిన్ను ఆయన తిరస్కరించనని వాగ్దానము చేసియున్నాడు. నిన్ను ప్రేమించి తన వాగ్ధానాన్ని నెరవేర్చునని కూడా అభయమిచ్చుచున్నాడు.

నీవు ఆయనకు చెందినవాడవు కనుక ఆయన నీకొరకు ప్రార్థించుచున్నట్లు యేసే యోహాను 17:9,10 వచనాలలో చెప్పినాడు. ఆయనకు దేవుని ద్వారా నీవు అప్పగింపబడియున్నావు కనుక నీ యందు ఆయన మహిమ పొందుచున్నాడు.

దేవుడు నిన్ను ప్రేమించుచున్నాడు. ఆ ప్రేమను పొందుకొనుటకు కీర్తనాకారుడైన దావీదుతో ఏకీభవించు:

> ❤ నా ప్రాణమా యెహోవాను సన్నుతించుము నా అంతరంగమునన్న సమస్తమా, ఆయన పరిశుద్ధ నామమును సన్నుతించుము నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము.
>
> ఆయన చేసిన ఉపకారములలో దేనిని మరువకుము. ఆయన నీ దోషములన్నిటిని క్షమించువాడు నీ సంకటము

లన్నిటిని కుదుర్చువాడు సమాధిలోనుండి నీ ప్రాణమును విమోచించుచున్నాడు. కరుణాకటాక్షములను నీకు కిరీటముగా ఉంచుచున్నాడు.

కీర్తనలు 103:1-4

5, 6, 8, 11-13, 17 ఈ వచనాలలో దావీదు ప్రభువును గూర్చి ఇలా అంటున్నాడు.

❤ పక్షిరాజు యౌవ్వనమువలె నీ యౌవనము క్రొత్తదగు చుండునట్లు మేలుతో నీ హృదయమును తృప్తిపరచుచున్నాడు యెహోవా నీతిక్రియలను జరిగించుచు బాధింపబడు వారికందరికి న్యాయమును తీర్చును.

యెహోవా దయదాక్షిణ్య పూర్ణుడు. దీర్ఘశాంతుడు కృపాసమృద్ధి గలవాడు, భూమికంటె ఆకాశము ఎంత ఉన్నతముగా ఉన్నదో ఆయనయందు భయభక్తులు గలవారియెడల ఆయన కృప అంత అధికముగా వున్నది.

పడమటికి తూర్పు ఎంత దూరమో ఆయన మన అతిక్రమములను మనకు అంత దూరపరచి యున్నాడు. తండ్రి తన కుమారులయెడల జాలిపడునట్లు యెహోవా తనయందు భయభక్తులు గలవారి యెడల జాలిపడును.

ఆయన కృప యుగయుగములు నిలుచును.

❤ యెహోవా యందు నమ్మిక యుంచు వానిని కృప ఆవరించుచున్నదని కీర్తనలు 32:10లో దావీదు తెలియజేయుచున్నాడు. 34వ కీర్తనలు 1-8లో ఆయన ఇలా వ్రాయుచున్నాడు:

❤ నేనెల్లప్పుడు యెహోవాను సన్నుతించెదను నిత్యము ఆయన కీర్తి నా నోట నుండును యెహోవానుబట్టి నేను అతిశయించు చున్నాను దీనులు దానిని విని సంతోషించెదరు నాతో కూడి యెహోవాను ఘనపరచుడి మనము ఏకముగా కూడి ఆయన నామమును గొప్పచేయుదుము నేను యెహోవాయొద్ద విచారణ చేయగా ఆయన నాకుత్తరమిచ్చెను.

నాకు కలిగిన భయములన్నిటిలో నుండి ఆయన నన్ను తప్పించెను. వారు ఆయనతట్టు చూడగా వారికి వెలుగు కలిగెను వారి ముఖము లెన్నడును లజ్జింపకపోవును. ఈ దీనుడు మెఱపెట్టగా యెహోవా ఆలకించెను అతని శ్రమలన్నిటిలోనుండి అతని రక్షించెను. యెహోవాయందు భయభక్తులు గలవారి చుట్టు ఆయనదూత కావలియుండి వారిని రక్షించును.

యెహోవా ఉత్తముడని రుచి చూచి తెలిసికొనుడి ఆయనను ఆశ్రయించు నరుడు ధన్యుడు.

ప్రేమసమస్త దోషములను కప్పునని పేతురు (1 పేతురు 4:8) లో చెప్పుచున్నాడు. దేవుని ప్రేమ నిన్ను కప్పుచున్నది. రోజుకు అనేకసార్లు ఆ ప్రేమ నీ జీవితాన్ని దీవించనిమ్ము. "దేవుడు నన్ను ప్రేమించుచున్నాడని" పదేపదే నీ నోటితో ఒప్పుకొనుము.

ఈ అధ్యాయములోనున్న లేఖనాలు ధ్యానించుము. నీ పక్షముగా ఈ విధేయత క్రియచేసినట్లయితే నీవు ఆశించుచున్న సమృద్ధి నిత్యప్రేమను ప్రభువు నుండి పొందుకొనగలవు.

# 2

# నీ భవిష్యత్ పట్ల నిశ్చయత

దేవుడు నీ కొరకు ఉద్దేశించిన నీ గొప్ప భవిష్యత్‌ను గూర్చి మాట్లాడే కొన్ని లేఖనాలు నీతో పంచుకోవాలని ఆశించుచున్నాను. దేవుడు నిన్ను సృజించినప్పుడు నీ పట్ల తన మనస్సులో ఒక ప్రత్యేకమైన సంకల్పము కలిగియున్నాడని మరియు నీవు విలువైన వ్యక్తివని గ్రహించాలని నేను కోరుకొనుచున్నాను.

"నాకు గమ్యమున్నది" అను పాటయందు ఆయన నీ పట్ల లక్ష్యము కలిగియున్నాడు. దాని నెరవేర్చగల సమర్థుడు దేవుడు. దానిని ఏర్పాటు చేసినాడు. పరిశుద్ధాత్మ శక్తి ద్వారా నెరవేర్చుటకొరకు పనిచేయుచున్నాడని రచయిత చెప్పుచున్నాడు. నాకు గమ్యమున్నది. అది వట్టి కోరికే కాదు నేను ఇటువంటి సమయము కొరకు జన్మించెను, ఇటువంటి సమయము కొరకు అనే ఒప్పుకోలుతో దీనిని ముగించినాను.

నీ గూర్చి ఏమిటీ! నీవు భవిష్యత్‌ను ఎలా చూస్తున్నావు?

నీవు సంపూర్ణ నిరీక్షణతో ఉండాలని దేవుడు కోరుకొనుచున్నాడు. కాని అపవాది నీవు నిరీక్షణలేని వానిగా ఉండాలనుకొనుచున్నాడు. ప్రతిదినము నీ

జీవితములో మంచి సంగతులు సంభవించాలని దేవుడు ఆశించుచున్నాడు అయితే సాతాను నాశనమును విపత్తును కోరుకొనుచున్నది.

❤ "బాధపడువాని దినములన్నియు శ్రమకరములు సంతోష హృదయునికి నిత్య విందు (పరిస్థితులు ఎలా వున్న) కలుగునని" సామెతలు 15:15లో వ్రాయబడివున్నది.

చెడు జరుగుతుందని అది జరుగక ముందే అనుకొనుట చెడును ఆశించుటయే ఈ చెడు కార్యాలనుబట్టి మన జీవితాలు బాధలతో నింపబడుచున్నవని లేఖనాలు స్పష్టంగా తెలియజేయుచున్నది.

❤ "సజీవుల దేశమున నేను యెహోవా దయను పొందుదునన్న నమ్మకము నాకు లేని యెడల నేనేమవుదును?" అని కీర్తనలు 27:13లో దావీదు చెప్పుచున్నాడు.

❤ "యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుము ధైర్యము తెచ్చుకొని నీ హృదయమును నిబ్బరముగా నుంచుకొనుము యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుమని" తరువాత వచనములో ప్రోత్సాహపరుచుచున్నాడు. యిర్మియా 29:11లో ప్రభువు మన పట్ల ఆయనకున్న ఉద్దేశాన్ని బయలుపరచుచున్నాడు. "నేను మిమ్మును గూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును, రాబోవు కాలమందు మీకు నిరీక్షణ కలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములేకాని హానికరమైనవి కావు; ఇదే యెహోవా వాక్కు".

నీవు నిరీక్షణ లేకుండా ఉండాలని అపవాది కోరుకొనుచున్నాడన్న విషయము గుర్తుంచుకొనండి. నిరీక్షణలేని వానిగా కనబడుట, ఆలోచించుట, మాట్లాడుట మరియు పనిచేయుటయే అపవాది కోరుకొనేది.

అయితే కీర్తనలు 42:11లో ❤ "దావీదు రచించిన శక్తివంతమైన మాటలు వినండి. నా ప్రాణమా, నీవేల కృంగియున్నావు? నాలో నీవేల తొందర

పడుచున్నావు? దేవునియందు నిరీక్షణ యుంచుము, ఆయనే నా రక్షణకర్త నా దేవుడు ఇంకను నేనాయనను స్తుతించెదను."

ఇలాంటి వచనాలు నీ హృదయములో భద్రపరచుకొనుటను బట్టి అవి నీకు నిరీక్షణను ఆశాభావాన్ని కల్గించుటకు నీకు దోహదపడతాయి. అప్పుడు నిరీక్షణతో చూచి, ఆలోచించి మాట్లాడి మరియు నిరీక్షణతో పనిచేసెదవు.

❤ "ఎందుకనగా ఈ నిరీక్షణ మనలను సిగ్గుపరచదు. మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో క్రుమ్మరింపబడియున్నదని" పౌలు రోమా 5:5లో చెప్పుచున్నాడు.

పరిశుద్ధాత్ముడు మనకు బోధించుచున్నాడు కనుక దేవుడు మనలను ప్రేమించుచున్నాడని మరోమాటలో చెప్పుట మనలను ప్రేమించి మనపట్ల ఒక సంకల్పాన్ని ఆయన కలిగియున్నాడు కనుక దేవుని యందు మన నిరీక్షణ వుంచుచున్నాము. మన నిరీక్షణ మన ఆశ ఆయన యందు వున్నప్పుడు మనము ఎన్నటికీ నిరాశపడము, భ్రమపడము లేక సిగ్గుపరచబడము.

❤ "దేవుడైన యెహోవా సూర్యుడును కేడెమునై యున్నాడు. యెహోవా కృపయు ఘనతయు అనుగ్రహించును యదార్థముగా ప్రవర్తించువారికి ఆయన ఏ మేలును చేయక మానడని" కీర్తనలు 84:11లో చూచుచున్నాము.

❤ "మీలో ఈ సత్క్రియ నారంభించినవాడు యేసుక్రీస్తు దినము (ఆయన రాకడ) వరకు కొనసాగించునని రూఢిగా నమ్ముచున్నానని" పౌలు ఫిలిప్పీ. 1:6లో మనకు అభయమిచ్చుచున్నాడు.

ఎఫెసీ. 2:10లో ఈ గొప్ప నిశ్చయతకు గల కారణాన్ని పౌలు వివరించు చున్నాడు.

> ❤ మరియు వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా స్థిరపరచిన (ముందుగా ఉద్దేశించిన) సత్ క్రియలు

చేయుటకై మనము క్రీస్తు యేసునందు ఆయన చేసిన పని (ఆయన చేతిపని)యై యున్నాము.

ఇప్పుడు నీకు నీవు ఈ ప్రశ్న వేసుకొనవచ్చు. దేవుడు నాపట్ల అలాంటి ప్రణాళిక కలిగియుంటే నేను దానిని ఎప్పుడు చూడబోవుచున్నాను? దాని జవాబు.

ప్రసంగి 3:17 నందు కలదు. ❤ "ప్రతి ప్రయత్నమునకు ప్రతి క్రియకు తగిన (నిర్ణీత) సమయము కలదు".

తన సొంత సమయములో దేవుడు నీ పట్ల తన ప్రణాళిక ఉద్దేశాన్ని నెరవేర్చును, నీవు చేయవలసిందల్లా పేతురు చెప్పిన విధంగా ఆయన మిమ్మును తగిన సమయములో హెచ్చించునట్లుగా ఆయన బలిష్టమైన చేతిక్రింద దీనమనస్కుడవై యుండుటయే (1 పేతురు 5:6).

చదువు వాడు పరుగెత్తుచు చదువ వీలగునట్లు నీవు భవిష్యత్ దర్శన విషయమును స్పష్టంగా వ్రాయమని ప్రవక్తయైన హబక్కుకు ప్రభువు సెలవిచ్చినాడు. ❤ "ఆదర్శన విషయము నిర్ణయకాలమున జరుగును. సమాప్తమగుటకై ఆతురపడుచున్నది, అది తప్పక నెరవేరును, అది ఆలస్యముగా వచ్చినను దాని కొరకు కనిపెట్టుము, అది తప్పక జరుగును జాగు చేయక వచ్చునని తరువాత వచనములో చెప్పబడినది" (హబక్కుకు 2:3).

❤ "తాను అబద్ధమాడజాలని నిశ్చలమైన రెండు సంగతులను బట్టి మన యెదుట వుంచబడిన నిరీక్షణను చేపట్టుటకు శరణాగతులమైన మనకు బలమైన ధైర్యము కలుగునట్లు ప్రమాణము చేసి వాగ్ధానమును ధృడపరచెను. ఈ నిరీక్షణ నిశ్చలమును, స్థిరమునై మన ఆత్మకు లంగరువలె నుండి తెరలోపల ప్రవేశించుచున్నామని" పౌలు హెబ్రీ. 6:18,19 వచనాలలో చెప్పుచున్నాడు.

❤ "దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగుచున్నవని యెరుగుదుమని" పౌలు రోమా 8:28లో చెప్పుచున్నాడు. ❤ "మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటన్నిటి కంటెను ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయగల శక్తి దేవునికున్నట్లు" పౌలు తర్వాత పత్రికలో మనకు దేవుని ఉద్దేశ్యాన్ని గుర్తుచేయుచున్నాడు (ఎఫెసీ. 3:20).

నీవు నిరీక్షించగల్గిన వాటికన్నా ఎక్కువ చేయుటకు ఆయన సిద్ధముగా వున్నాడు. కనుక నీవు సంపూర్ణ నిరీక్షణ కలిగియుండాలని దేవుడు ఆశించుచున్నాడు. ఒకవేళ నీవు అపవాది ఆశించిన విధంగా నిరీక్షణ లేక ఉన్నట్లయితే దేవుడు అడిగినది ఆయనయందు నిరీక్షణ ఆశ కల్గియుండి మరియు ఆయన నీ జీవితము పట్ల మంచి ప్రణాళిక కల్గియున్నాడని నమ్ముట. అది నెరవేర్చబడు ప్రక్రియలో వున్నదని నీవు నమ్ముట లేదు గనుక ఆయనలో నీకు భాగముండదు.

ఎఫెసీ. 1:11లో పౌలు క్రీస్తును గూర్చి ఇలా అంటున్నాడు. ❤ "మరియు క్రీస్తునందు ముందుగా నిరీక్షించిన మనము తన మహిమకు కీర్తి కలుగజేయవలెనని, దేవుడు తన చిత్త ప్రకారమైన సంకల్పమును బట్టి మనలను ముందుగా నిర్ణయించి (ఏర్పరచి, నియమించి) ఆయన (దేవుని) యందు స్వాస్థముగా ఏర్పరచెను, ఆయన తన చిత్తానుసారముగా చేసిన నిర్ణయము చొప్పున సమస్త కార్యములను జరిపించుచున్నాడు."

యెహెూషువ 1:8లో తన సేవకుడైన యెహోషువకు ఇచ్చిన ఆజ్ఞను మరువవద్దు. ❤ "ఈ ధర్మ శాస్త్ర గ్రంథమును నీవు బోధింపక తప్పిపోకూడదు. దానిలో వ్రాయబడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నీవు జాగ్రత్త పడునట్లు దివారాత్రము దానిని ధ్యానించిన యెడల నీ మార్గము వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు".

❤ "నీవు దానిననుసరించుటకు ఆ మాట నీకు బహు సమీపముగా ఉన్నది. నీ హృదయమున నీ నోట నున్నదను" మాటలు ద్వితీ. 30:14లో కలవు.

యెషయా 55:11లో దేవుని మాటలు వ్యర్థముగా పోక ఎలా నెరవేర్చబడునో ప్రభువు మనకు చూపించుచున్నాడు. ❤ "నిష్ఫలముగా (ఫలము లేకుండా, నిరుపయోగంగా) నా యొద్దకు మరలక అది నాకు అనుకూలమైన దానిని నెరవేర్చును, నేను పంపిన కార్యమును సఫలము చేయును."

నీ నోటిని దేవుని కప్పగించి దానిని ఆయన నోరుగా మార్చనిమ్ము. ఆయన వాక్కును మాట్లాడుట ప్రారంభించు ఎందుకనగా ఆయన నీ కొరకు మంచి భవిష్యత్ ఉద్దేశ్యము, ప్రణాళిక కలిగియున్నాడు. మాట్లాడు విషయములో శత్రువుతో కాక దేవునితో ఏకీభవించు.

మనందరము ఆత్మీయ గమ్యాన్ని కలిగియున్నామని గుర్తుంచుకోండి.

నీవు భవిష్యత్‌లో ఎలా ఉండెదవని నీవనుకొనుచున్నావు? నీవు ప్రతిసారి ఇంకా పతనం అవుదువనే తలంపునే అపవాది కలిగిస్తాడు కాని నీవు మెరుగుపరచబడుదువనే తలంపును మాత్రం కలగనివ్వడు. ఎంతవరకు వచ్చినాము అను విషయముపై కాక ఎంతదూరము వెళ్ళాలి అన్న తలంపు నీకు అపవాది కలిగిస్తాడు.

నేను ఇక ఎన్నటికి మారను అను చింతతో నిన్ను నీవు భంగపాటుకు గురిచేసికొనుచున్నావా? అన్నివేళల దేవుడు నిన్ను మార్చుచున్నాడన్న నిరీక్షణ కల్గియుండుము. నీ యందు ఆయన వాక్యము క్రియ జరిగించుచున్నది.

ద్వితీ. 7:22 ప్రకారము మన శత్రువుపై దేవుడు మనకు క్రమమైన విజయాన్ని దయచేయును.

2 కొరింథీ. 3:18 ప్రకారము ఆయన వాక్యమందు ప్రభువును మనము చూచుచుండగా మనందరము కూడా ❤ "మహిమ నుండి అధిక మహిమను పొందుచు ఆయన పోలికలోనికి మార్చబడెదము."

రోమా 12:2 ప్రకారము మన మనస్సు నూతన తలంపులతో, ఆశయాలతో వైఖరులతో ❤ "మారి నూతనమగుటవలన మనము రూపాంతరము పొందుచున్నాము. అదే ఉత్తమమును, అనుకూలమును సంపూర్ణమైన దేవుని (ఆయన దృష్టిలో) చిత్తము."

కొలస్సీ. 1:27 ప్రకారము మహిమైశ్వర్యమైన యుగముల మర్మము క్రీస్తునందున్నది. నీవు మహిమపరచబడుట నీ పరలోకపు తండ్రి చూచుచున్నాడు. ఆ మహిమ స్థితిలో మనముండు నిమిత్తము దానికి మనలను సిద్ధపరచ దర్శనముతో దేవుడు తన ఆత్మను పంపినాడు.

"మన దేవుని అద్భుతాల ప్రత్యక్షతను" నేను మహిమగా నిర్వచించు చున్నాను. లేఖనములన్నియు మన కొరకు వ్రాయబడినవన్న నిరీక్షణ విశ్వాసముతో కల్గియుందుము.

విశ్వాసముతో కూడిన మరియు వాక్యాధారమైన రూఢియైన ఒప్పుకోళ్ళను చేయుట నేర్చుకో. "మహిమ నుండి అధిక మహిమలోనికి మరియు ఆయన స్వరూపములోకి మార్చబడుచున్నానని బిగ్గరగా చెప్పుము. అధిక మహిమకు నా యందున్న క్రీస్తే నిరీక్షణ. దేవుని ఆత్మ ప్రతిదినము నన్ను క్రమక్రమముగా మార్చుచున్నది. నా జీవితానికి ఒక ఉద్దేశ్యమున్నది. నా కొరకు దేవుడు ఒక మంచి ప్రణాళిక కలిగియున్నాడు" (2 కొరింథీ. 3:18)

రోమా 4:17 ప్రకారము మనము సేవించు దేవుడు లేని వాటిని ఉన్నవాటినిగా పిలుచుచున్నాడు.

తన వాక్యమందు దేవుడు మనలను గూర్చి ఏమి చెప్పుచున్నాడు?

❤ అయితే మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచిన వాని గుణాతిశయములను ప్రచురముచేయు నిమిత్తము, ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజకసమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు.

1 పేతురు 2:9

మీ కొరకు ఉద్దేశించిన అద్భుత కార్యాలు, పరిపూర్ణతలు, సుగుణాలు ఇతరులు చూచునట్లు దేవుడు వాటిని బహిర్గతము చేయాలని ఇష్టపడుచున్నాడు.

"చీకటి నుండి ఆశ్చర్యకరమైన వెలుగులోనికి పిలువబడినాను" అని చెప్పుట నేర్చుకొనుము.

నీ పట్ల నీకు సరైన అభిప్రాయము లేకపోవుట మరియు నీ పట్ల నీవు అయిష్టత కలిగియుండుట అంధకారముతో సమానము. నీకు ఎటువంటి విలువ యోగ్యత లేదనుకొనుట కూడా అంధకారమే.

మలాకీ 3:17 ప్రకారము, మనము ప్రభువుకు ప్రశస్తమైన వారమును ఆయన స్వకీయ సంపాద్యమును ఆయన సొత్తయిన ప్రజలమైయున్నాము. అవును, నీవు అమూల్యమైన వాడవు. నీవు ఒక ఉద్దేశ్యము కలిగియున్నావు. నీకు గమ్యమున్నది. ప్రభువు నీ జీవితము పట్ల ఒక గొప్ప ప్రణాళిక కల్గియున్నాడు. నీవు చరిత్రయందు ఒక స్థానము కల్గియున్నావు. ఆ స్థానము పొందుకోవాలంటే నీవు తప్పక విశ్వసించాలి.

"కాని జాయిస్, నేను చాలాసార్లు వైఫల్యము చెందినాను. నేను చాలా తప్పులు చేసినాను, నేను దేవుని నిరుత్సాహపరిచినాను అని కూడా నాకు తెలుసు" అని నీవు చెప్పవచ్చు.

ఫిలిప్పీ. 3:13,14లో పౌలు తాను ఇంకా పరిపూర్ణుడను కాలేదని, అయితే దానిని నేను విడిచిపెట్టుటలేదని ఆయన ఒప్పుకొనుచున్నాడు.

> ❤ సహోదరులారా, నేనిదివరకే పట్టుకొనియున్నానని తలంచుకొనను అయితే ఒకటి చేయుచున్నాను; వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటికొరకై వేగిరపడుచు క్రీస్తుయేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని, గురియొద్దకే పరుగెత్తుచున్నాను.

దేవుడు నీ జీవితము పట్ల ఒక మంచి ప్రణాళిక కల్గియున్నాడు. గతము యందు జీవించవద్దు. యెషయా 43:18,19 వచనాలలో వున్న దేవుని వాక్యాన్ని వినుము:

> ❤ మునుపటివాటిని జ్ఞాపకము చేసికొనకుడి. పూర్వకాలపు సంగతులను తలంచుకొనకుడి. ఇదిగో నేనొక నూతనక్రియ చేయుచున్నాను ఇప్పుడే అది మొలుచును మీరు దానిని ఆలోచింపరా? నేను అరణ్యములో త్రోవ కలుగ జేయుచున్నాను ఎడారిలో నదులు పారజేయుచున్నాను.

తుదకు యెషయా 43:25లో దేవుడు చెప్పుచున్నది ఆలకించుడి ❤ "నేను నేనే నా చిత్తానుసారముగా నీయతిక్రమములను తుడిచివేయు చున్నాను. నేను నీ పాపములను జ్ఞాపకము చేసికొనను".

నీవు ఎలా ఉండాలని ఆయన ఉద్దేశించినాడో ఆ స్థితిలో నిన్ను చూడాలని దేవుడిష్టపడుచున్నాడు. నీకొరకు నిర్ణయించిన మంచి జీవితమును నీవు ఆస్వాదించుట ఆయన చూడాలని కోరుకొనుచున్నాడు. నీవు గతములో చేసిన ప్రతి పాతకమును కృప దయల ద్వారా కొట్టివేయుటకు సంసిద్ధుడుగా నున్నాడు

మరియు నీవు భవిష్యత్తులో చేయు తప్పిదములకు కూడా ఆయన ఇప్పటికే అనుగ్రహాన్ని ఏర్పాటు చేసినాడు.

నీవు గతాన్ని గూర్చిన చింతలోగాని, భవిష్యత్‌ను గూర్చి భయములో గాని జీవించనక్కరలేదు. నీకు అవసరమైన ప్రతి విషయములో సహాయము చేయుటకు ఆయన సిద్ధంగా వున్నాడు.

❤ "యెహోవా కొరకు ఎదురు చూచువారు (ఆయన కొరకు ఆశించి ఆయన యందు నిరీక్షణ వుంచువారు) నూతన బలము పొందుదురు. వారు పక్షిరాజువలె రెక్కలుచాపి పైకి (దేవుని దగ్గరకు) ఎగురుదురు. అలయక పరుగెత్తుదురు. సొమ్మసిల్లక నడిచిపోవుదురు" అని యెషయా 40:31లో వ్రాయబడినది.

ముందున్న దినాలలో నీవు ఎదుర్కొను ప్రతి అవసరత దైవానుగ్రహముచే తీర్చబడినదని తెలుసుకొనుట మరియు ఆయన నిత్యమైన ప్రేమ నిశ్చయత కల్గియుండుట ఎంత అద్భుతము.

వాగ్ధానము చేసిన దానిని నెరవేర్చుటకు సమర్థుడని రూఢిగా విశ్వసించి (రోమా 4:21) ఆయన అద్భుత వాగ్ధానాలను ప్రణాళికలను ఆయుధాలుగా ధరించి భవిష్యత్తును నిరీక్షణతో నమ్మకంగా ఎదుర్కొనుము.

ముందుకు సాగిపో వెనుకకు చూడవద్దు. విశ్వాసమందు అడుగుముందుకు వేయుము.

నీవు ఆత్మీయగమ్యము కల్గియున్నట్లు మరువవద్దు!

# 3

# క్రీస్తు యందు నీ నీతిని తెలుసుకొనుట

నీతిని గూర్చిన కొన్ని లేఖనాలు మీతో పంచుకోవాలని ఇష్టపడుచున్నాను.

"నేను దేవుని నీతిగా చేయబడినాను" అనుపాట దేవుని కుటుంబము లోనికి చేర్చబడుటను గూర్చి రాజవంశసభ్యుడిగా ఆయన సింహాసనము యెదుట నిలువబడుటను గూర్చి ఎటువంటి పాపము లేకుండా ఆయన ప్రశస్త రక్తముచే కొనబడిన క్రీస్తువారసునిగా వుండుటను గూర్చి మాట్లాడుచున్నది.

పౌలు 2 కొరింథీ. 5:21లో వ్రాసిన ప్రకారము నీవు క్రీస్తుయందు దేవుని నీతియై వున్నావు. ❤ "ఎందుకనగా మనమాయనయందు దేవుని నీతి (మనముండాల్సినది, మంచితనము ద్వారా ఆయనతో వున్న సరియైన సంబంధమునందు అంగీకరింపబడినది) అగునట్లు (దయచేయుట, దానిలో వున్నట్లు చూచుట మరియు దానియందుండుట) పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను".

కీర్తనలు 48:10లో దేవుని గూర్చి ఇలా చెప్పబడినది. ❤ “దేవా, నీ నామము ఎంత గొప్పదో నీ కీర్తియు భూదిగంతములవరకు అంత గొప్పది. నీ కుడిచెయ్యి నీతితో నిండియున్నది”.

నీతితో కూడిన దేవుని హస్తము నీవైపు చూపబడినది.

❤ 1 కొరింథీ 1:8లో పౌలు చెప్పునదేమనగా, “మన ప్రభువైన యేసు క్రీస్తు (మెస్సీయా) దినమందు మీరు నిరపరాధులై యుండునట్లు అంతమువరకు ఆయన (దేవుడు) మిమ్మును (నిలకడగా వుంచి, బలమిచ్చి విముక్తి నిచ్చి, నీకు వ్యతిరేకముగా వచ్చు నీ పనులలో నీతో వుండి) స్థిరపరచును”.

దాని అర్ధమేమిటో మీకు తెలుసా: నీవు సరిగా సరియైన స్థలములో వున్నావని దేవుడు గ్రహించుటయే దాని అర్ధము. ఈ దినమున నిన్ను సరియైన స్థలములో ఆయన ఉంచి వున్నాడు. సహోదరుల మీద నేరము మోపు అపవాది అబద్ధముల నుండి నిన్ను సంరక్షించుటకు ఆయన సిద్ధముగా నిలబడియున్నాడు. (ప్రకటన 12:10).

నీ నమ్మిక క్రీస్తు యందుంచినట్లయితే, దేవుడు నిన్ను అపరాధిగా ఎంచడు. నీ నిర్దోషత్వాన్ని నిరూపించుటకు ఆయన సంసిద్ధుడుగా వున్నాడు.

కొండమీద ప్రసంగములో తన అనుచరులకు యేసు క్రింది విషయమును బోధించినాడు. ❤ “నీతి కొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు (తిరిగి జన్మించిన దేవుని బిడ్డ ఆయన దయను రక్షణను అనుభవించును) వారు తృప్తిపరచబడుదురు” (మత్తయి 5:6).

యేసు ప్రకారము, తిరిగి జన్మించిన బిడ్డగా నీవు దేవుని దయను పొందుకునే స్థితిలో జీవించే హక్కు నీకు వున్నది. జీవితాన్ని ఆనందించే హక్కు నీకున్నది. అది నీకు దేవుడిచ్చిన వరము.

"క్రీస్తు యందు నేను దేవుని నీతియై యున్నానన్న" వాక్యమును నీ నోటితో ఒప్పుకొనుట ప్రారంభించుము.

నీ స్వతహాగా దేవునితో సరైన సంబంధము కల్గియుండే భారమైన పనిని నీవు బహుశా చేస్తుండవచ్చు. ఆ విధంగా నీతిని పొందుకొనలేవు. రక్షణవలె నీతి క్రియకాదు. అది వరము కనుక నీ ప్రయత్నాలను విడచి దేవుడు క్రీస్తు నీతిని నీకు అందించులాగున ఆయనను ఆశ్రయించుట నేర్చుకో.

❤ నీ భారము యెహోవా మీద మోపుము. ఆయనే నిన్ను ఆదుకొనును. నీతిమంతులను (జారనివ్వడు, పడనివ్వడు, అపజయంపాలు చేయడు) ఆయన ఎన్నడును కదలనీయడు. (కీర్తనలు 55:22).

రోమా 4:1-3లో పౌలు అబ్రహాము నీతిని గూర్చి చెప్పుచున్నాడు.

> ❤ కాబట్టి శరీరము విషయమై మన మూలపురుషుడగు అబ్రాహామునకేమి దొరికెనని అందుము (ఆయన పొందుకొన్న స్థితిని ఇది ఎలా ప్రభావితము చేస్తుంది).
>
> అబ్రాహాము క్రియల మూలముగా నీతిమంతుడని (అపరాధము నుండి విముక్తి పొందుట) తీర్చబడినయెడల అతనికి అతిశయ కారణము కలుగును గాని అది దేవుని యెదుట కలుగదు. లేఖనమేమి చెప్పుచున్నది? అబ్రాహాము దేవుని నమ్మెను, (విశ్వసించెను) అది అతనికి నీతిగా (దేవుని యెదుట నీతిమంతునిగా నిలబడుట) ఎంచబడెను.

తరువాత 23 మరియు 24 వచనాలలో పౌలు ఈ విధంగా చెప్పుచున్నాడు:

> ❤ అది (మాటలు) అతనికి ఎంచబడెనని అతని నిమిత్తము మాత్రమే కాదుగాని మన ప్రభువైన యేసును మృతులలోనుండి

లేపినవానియందు విశ్వాసముంచిన (నమ్మికముంచి, అనుసరించుచు, ఆధారపడు) మనకును ఎంచబడునని మన నిమిత్తముకూడ వ్రాయబడెను.

మరో మాటలో చెప్పాలంటే, పౌలు చెప్పునదేమనగా విశ్వాసము ద్వారా నీతిని పొందుకొనుచున్నాను కాని క్రియ ద్వారా కాదు అని ఆయన అర్థం.

క్రీస్తు యందు విశ్వాసముంచినప్పుడు, దేవుడు మనలను నీతిమంతులుగా ఎంచును. క్రీస్తు రక్తము ద్వారా మనలను సరిచేయు నిర్ణయాన్ని దేవుడు అక్షరార్థంగా తీసుకుంటాడు. ఆయన సార్వభౌముడైన దేవుడు, ఆయన ఇష్టపడిన యెడల ఆ నిర్ణయాన్ని తీసుకునే హక్కు ఆయనకున్నది.

5వ అధ్యాయము మొదటి వచనములో తన అంశాన్ని పౌలు క్రోడీకరించుచున్నాడు. ❤ "కాబట్టి విశ్వాసమూలముగా మనము నీతిమంతులుగా (నిర్దోషులుగా, నీతిమంతులుగా ప్రకటింపబడి దేవుని యెదుట నిలువబడెదము) తీర్చబడి మన ప్రభువైన యేసుక్రీస్తు (మెస్సయ్య అభిషిక్తుని) ద్వారా దేవునితో సమాధానము (ఆ సమాధానాన్ని కలిగియుండి దానియందు ఆనందించెదము) కలిగియుందుము" (రోమా 5:1).

మన దౌర్భాగ్య క్రియల ద్వారా సమాధానాన్ని పొందుకొనము; క్రీస్తు ముగించిన పని ద్వారా దానిని పొందుకొనుచున్నాము.

దావీదు కీర్తనలు 37:25లో వ్రాసినాడు. ❤ "నేను చిన్నవాడనై యుంటిని. ఇప్పుడు ముసలివాడనై యున్నాను. అయినను (నిశ్చయముగా) నీతిమంతులు విడువబడుటగాని వారి సంతానము బిక్షమెత్తుట గాని నేను చూచి యుండలేదని."

తల్లిదండ్రులమైన మనము క్రీస్తు ద్వారా దేవునితో మన నీతి అను స్థితిని పొందుకొనగల్గితే మన పిల్లలు ఆ నీతి స్వీకరించగలరు.

అపరాధ అయోగ్య, నేరస్థుల భావాలతో పెంచబడిన బిడ్డలు అవే అలవాట్లను వారు తల్లిదండ్రుల దగ్గర నుండి స్వీకరిస్తారు.

అలాగే, దేవుడు పిల్లలను ప్రేమించుచున్నాడని, ఆయనకు వారు ప్రత్యేకమైన వారని, వారి జీవితాల పట్ల దేవుడు మంచి ప్రణాళిక కల్గియున్నాడని, క్రీస్తు రక్తము ద్వారా వారు నీతిమంతులుగా చేయబడినారని తల్లిదండ్రులు అర్థము చేసికొని దానిని నమ్మినట్లయితే అదే సత్యమనే కప్పు క్రింద జీవించే పిల్లలు, తల్లిదండ్రుల విశ్వాసముచే ప్రభావితము చేయబడి క్రీస్తును ఆయన వాగ్ధానములను సొంతము చేసుకొనెదరు.

❤ "యదార్ధ వర్తనుడగు నీతిమంతుల పిల్లలు వాని తదనంతరము ధన్యులగుదురు (సంతోషించువారు, అదృష్టవంతులు మరియు కోరదగిన వారు)" అని సామెతలు 20:7లో చెప్పబడినది.

కీర్తనలు 37:39 ప్రకారము ❤ "యెహోవాయే నీతిమంతులకు రక్షణాధారము (ఎల్లప్పుడు) బాధ కలుగునప్పుడు ఆయనే వారికి ఆశ్రయదుర్గము. దేవుడు మన పక్షమునున్నాడు. ఆయన వాక్కు సత్యమైనది, శాంతి, నీతి రక్షణ మరియు శత్రువుపై విజయాన్ని మనకు అది వాగ్ధానము చేయుచున్నది".

దేవుని యొద్దనుండి వచ్చు వాగ్ధానాన్ని ఒప్పుకొనుట నేర్చుకొనుము, యెషయా 54:17లో ❤ "నీకు విరోధముగా రూపించబడిన యే ఆయుధమును వర్ధిల్లదు న్యాయ విమర్శలో నీకు దోషారోపణ చేయు ప్రతివానికి నీవు నేరస్థాపన చేసెదవు. యెహోవా యొక్క సేవకునికి నీతి సమాధానము (నీతి, బాధ్యత, శత్రువులపై విజయము) నా వలన కలుగుచున్నది! ఇది వారి స్వాస్థ్యము (నీతిగల వారికి నేనిచ్చుచున్నాను). ఇదే యెహోవా వాక్కు".

దావీదు కీర్తన 34:15లో చెప్పుచున్నాడు:

❤ "(నిశ్చయముగా) యెహోవా దృష్టి నీతిమంతుల మీదనున్నది ఆయన చెవులు వారి మొరకు ఒగ్గియున్నవని"

ఆయన మిమ్మును ప్రేమించుచున్నాడు గనుక, మిమ్ములను గమనించుచు మీకు చెవియొగ్గి యున్నాడని దాని అర్థము.

అయితే 17,19 మరియు 22 వచనాలలో దావీదు ఇలా అంటున్నాడు:

❤ నీతిమంతులు మొఱ్ఱపెట్టగా యెహోవా ఆలకించును. వారి శ్రమలన్నిటిలోనుండి వారిని విడిపించును. నీతిమంతునికి (నిత్యము) కలుగు ఆపదలు అనేకములు వాటి అన్నిటిలోనుండి యెహోవా వానిని విడిపించును.

యెహోవా తన సేవకుల ప్రాణమును విమోచించును ఆయన శరణుజొచ్చినవారిలో ఎవరును అపరాధులుగా ఎంచబడరు.

నీవు క్రీస్తును రక్షకునిగా స్వీకరించినప్పటి నుండి నీవు ఆయన యందు ఎదుగుచున్నావు. నీవు యాత్రలో వున్నావని నీవు చెప్పవచ్చును. మార్గమధ్యములో నీవున్నప్పుడు కొన్ని తప్పులు చేసెదవు. నీ పని పరిపూర్ణముగా వుండక పోవచ్చు, కాని హృదయము ప్రభువు యెడల పరిపూర్ణముగా వున్నట్లయితే యాత్రలో నిన్ను పరిపూర్ణునిగా ప్రభువు ఎంచునని నమ్ముచున్నాను.

"నీవు నీతిగలదానివై స్థాపింపబడుదువు". "నీవు భయపడనక్కరలేదు. బాధించువారు నీకు దూరముగా నుందురు భీతి నీకు దూరముగా ఉండును. అది నీ దగ్గరకు రానే రాదని" యెషయా 54:14లో ప్రభువు ప్రకటించుచున్నాడు".

నిశ్చయముగా నీతిమంతులు సింహమువలె ధైర్యముగా నుందురని సామెతలు 28:1లో చెప్పబడినది. క్రీస్తుద్వారా నీవు నీతిమంతుడవని గ్రహించినప్పుడు ఈ విషయములో నీ సంబంధము సత్యమైనదైతే నీవు భయపడవు, భీతిచెందవు ఎందుకనగా నీతి ధైర్యమును పుట్టించును.

> ❤ మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడుగాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను.
>
> గనుక మనము కనికరింపబడి సమయోచితమైన (తగిన సమయానుకూల మరియు అవసరతయందు ఆదుకొనే) సహాయముకొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము (అయోగ్యులైన పాపులయెడల దేవుడు చూపించే దయ సింహాసనము) నొద్దకు చేరుదము.
>
> హెబ్రీయులకు 4:15,16

దేవుని కృపాసనము యొద్దకు ధైర్యముగా ఇప్పుడు వెళ్ళగలము. అయితే అది మన పరిపూర్ణతను బట్టి కాదుకాని ఆయన మూలముగా ❤ "కాబట్టి విశ్వాస మూలముగా మనము నీతిమంతులముగా (నిర్దోషిగా, న్యాయముగా, దేవునితో సత్సంబంధము కలిగిన వారముగా) తీర్చబడి మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము (నిశ్చయముగా) కలిగియుందుము" (రోమా 5:9).

నాలో ఏమి తప్పున్నది? అని నీ జీవితమంత నీవు ఆశ్చర్యపడుతూ వుండవచ్చు. అలాగైతే నీకొక శుభవార్త ప్రకటించుచున్నాను: **నీవు నీతిమంతునిగా చేయబడినావు!**

ఇప్పుడు నీలో సరియైనది కలదు.

ముందున్న వాటిని మీ నోటితో ఒప్పుకొనమని మిమ్మును నేను ప్రోత్సాహపరచుచున్నాను.

"నేనుండాల్సిన స్థలములో నేనుండకపోవచ్చు కాని గతంలో నేనున్న స్థలములో లేను దానిని బట్టి దేవునికి వందనములు. నాకు ఫర్వాలేదు నేను మంచి మార్గములో ఉన్నాను."

మార్పు ఒక ప్రక్రియని మరియు దానియందు నీవున్నావని గుర్తుంచు కొనుము. నీలోమార్పు కలుగుచుండగా దేవుడు నిన్ను నీతిమంతునిగా ఎంచును.

నీవు నీతిమంతుడవు. క్రీస్తు రక్తము ద్వారా దేవుడు నిన్ను ఆ స్థితిలో వుంచినాడు.

నీ జీవితములో సంభవించే మార్పులు దేవుడు విశ్వాసము ద్వారా నీకనుగ్రహించిన నీ నీతిస్థితికి నిదర్శనములు.

దేవునికి మహిమ!

ఇది శక్తివంతమైనది!

నీవు దేవుని ప్రేమను నీతిని పొందుకొనుచుండగా, నీకు అభద్రత, తిరస్కార భయముల నుండి విముక్తి కలుగుతుంది.

"క్రీస్తు యందు నేను దేవుని నీతిని" అని ఇప్పుడే ప్రకటించుము. ప్రతిదినము ఈ సత్యాన్ని అనేకసార్లు ఒప్పుకొనమని ప్రోత్సహించుచున్నాను.

❤ "దేవుని రాజ్యము భోజనము పానము కాదు కాని, నీతియు సమాధానమును పరిశుద్ధాత్మయందలి ఆనందమునై యున్నది" అని పౌలు రోమా 14:17లో చెప్పుచున్నాడు. నీతి సమాధానమునకును, సమాధానము సంతోషమునకు నడిపించును.

సమాధానము సంతోషము నీకు కొదువగా ఉన్నట్లయితే, నీతిని గూర్చిన ప్రత్యక్షత నీకు కొదువగా నున్నట్లే, భౌతికంగా, ఆర్ధికంగా దేవుడు నిన్ను దీవించాలని కోరుకొనుచున్నాడు.

అయితే దోషులు అపరాధులు ఎన్నటికి నిజమైన అభివృద్ధిని వారి జీవితాలలో చూడలేరు. వారి నీతిని గుర్తెరిగినవారు వర్ధిల్లి క్షేమముగా నుందురని బైబిలు చెప్పుచున్నది.

దేవుడు నిన్ను గూర్చి ఏమి అంటున్నాడో నీకు తెలుసా? "యెహోవా ధర్మశాస్త్రము నందు ఆనందించువాడు నీటి కాలువల యోరను నాటబడినవాడై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుండును". అతడు చేయునదంతయు సఫలమగును. (కీర్తనలు 1:3).

నీ చెడు విషయాలపై యోచన కలిగియుండక, దేవునితో నీకున్న మంచి సంబంధమును గూర్చి ధ్యానించుము.

యెహోషువ 1:8 ప్రకారము ❤ "ఈ ధర్మ శాస్త్రగ్రంథమును నీవు బోధింపక తప్పిపోకూడదు. దానిలో వ్రాయబడిన వాటన్నిటిప్రకారము చేయుటకు నీవు జాగ్రత్తపడునట్లు దివారాత్రము దాని ధ్యానించినయెడల నీ మార్గమును వర్ధిల్లజేసికొని చక్కగా ప్రవర్తించెదవు".

కీర్తనలు 1:2,3 ప్రకారము అలవాటుగా నీవు దేవుని వాక్యాన్ని దివారాత్రము ధ్యానించినప్పుడు నీవు మంచి ఫలమిచ్చు చెట్టువలె నుందువు మరియు నీవు చేయునదంతయు సఫలమగును.

వాక్యాన్ని ధ్యానించి ప్రకటింపుము. సాతాను నీ మనస్సుపై దాడి చేసినప్పుడు వాక్యముతో దానిని ఎదిరించుము. వాక్యముచే యేసు అపవాదిని ఓడించిన విషయము స్మరణకు తెచ్చుకొనుడి. ❤ "...అని వ్రాయబడివున్నదని." (లూకా 4:4,8,10).

❤ "యెహోవా నామము (చెడుకందని) బలమైన దుర్గము. నీతిమంతుడు (న్యాయవంతుడు, దేవుని సత్సంబంధము కలిగినవాడు) అందులోకి పరుగెత్తి (ఎల్లప్పుడు) సురక్షితముగా నుండును" అని సామెతలు 18:10లో చెప్పబడినది.

కీర్తనలు 72:7 ప్రకారము ❤ "చంద్రుడు లేక పోవువరకు వారికి క్షేమాభివృద్ధి కలుగును" నీ నీతి విషయములో దేవునితో ఏకీభవించు అప్పుడు నీవు సమాధానమందు వర్ధిల్లెదవు.

"అయితే నేను చేసిన భయంకర కార్యాల పరిస్థితి ఏమిటి? అని నీవనుకొనవచ్చు."

హెబ్రీ. 10:16-18లో దేవుడు తన ప్రజల గూర్చి మాట్లాడిన మాటలు మీకు గుర్తు చేయాలని ఆశించుచున్నాను:

> ❤ "ఏలాగనగా ఆ దినములైన తరువాత నేను వారితో చేయబోవు నిబంధన (ఒడంబడిక, ఒప్పందము) ఇదే; నా ధర్మవిధులను వారి హృదయమునందుంచి వారి మనస్సు (అంతరంగ ఆలోచన, అవగాహనల) మీద వాటిని వ్రాయుదును అని చెప్పిన తరువాత వారి పాపములను వారి అక్రమములను ఇకను ఎన్నటికిని జ్ఞాపకముచేసికొనను అని ప్రభువు చెప్పుచున్నాడు. వీటి క్షమాపణ (మన్నన, శిక్ష రద్దు చేయు) ఎక్కడ కలుగునో అక్కడ పాపపరిహారార్థబలి యికను ఎన్నడును ఉండదు."

మరో మాటలో, నీ పాపము పూర్తిగా కొట్టివేయబడినది కనుక నీకు శిక్ష లేదు. యేసు అంత సంపూర్ణమైన కార్యము జరిగించి వుండగా, నీ పాపముల విషయమై నీకు చేయగల్గినది ఏమియును లేదు. విశ్వాసము ద్వారా దేవుని

ఉచిత వరాన్ని స్వీకరించుటయే నీవు చేయవలసిన పని. అది దేవుని సంతోషపెట్టును.

హెబ్రీ. 10:19,20 ప్రకారము క్రీస్తు తన బలి ద్వారా మనకొక ❤ "నూతన సజీవమైన మార్గాన్ని తెరచినాడు", ఆ మార్గము ద్వారా క్రీస్తు "రక్తములో వున్న శక్తిని బట్టి" దేవుని సన్నిధిలోకి సంతోషముగా ప్రవేశించెదము.

దేవునికి నీకు మధ్య ఒక అడ్డు తెర ఉండనవసరము లేదు.

ఎంత అద్భుతమైన వార్త!

నీ పాపములు కొట్టివేయబడి, తొలగింపబడి మరియు ఉపేక్షింపబడినవి కనుక నీవిక **నిర్భయముగా** దేవునితో సహవాసము కలిగియుండవచ్చు.

(2 కొరింథీ. 5:21) ప్రకారము, క్రీస్తు యందు నీవు దైవ నీతిగా చేయబడినావు. ఆ స్థితియందు ఆనందించు!

# 4

# నీ జీవితములో నున్న భయమును అధిగమించుట

నీ పట్ల నీకు భయాలు ఉన్నాయా?

"భయపడకు నా బిడ్డ" అని పాటయందు ప్రభువు క్రింది మాటలు చెప్పుచున్నాడు.

"భయపడకు నా బిడ్డా
నేను నీతో ఎల్లప్పుడు ఉన్నాను
నీ నొప్పిని భరించుచున్నాను
మరియు నీ కన్నీరు అంతటిని చూచుచున్నాను.
భయపడకు నా బిడ్డా
నేను నీతో ఎల్లప్పుడు ఉన్నాను
నీకు సంబంధించిన వాటి పట్ల
ఎలా శ్రద్ధ వహించాలో నాకు తెలుసు"

2 తిమోతి 1:7లో తన యవ్వన శిష్యుడైన తిమోతితో భయపడక నీ పరిచర్య జరిగించుమని పౌలు హెచ్చరించుచున్నాడు. ❤ "దేవుడు మనకు శక్తియు, ప్రేమయు, ఇంద్రియ నిగ్రహముగల ఆత్మనే యిచ్చెనుగాని పిరికి (ధైర్యములేని, అవాచ్యపు, యిచ్చకపు) తనముగల ఆత్మనియ్యలేదు." దానిని మరువవద్దు.

దానిని కంఠత పెట్టి నీకు భయము, దిగులు కలిగినప్పుడు దానిని జ్ఞప్తికి తెచ్చుకొనుము.

భయము దేవుని యొద్ద నుండి వచ్చునది కాదు. భయముతో మన హృదయాన్ని నింపాలని ఆశించేది అపవాది. దేవుడు నీ జీవితము పట్ల ప్రణాళిక కల్గియున్నాడు. ఆయన యందు విశ్వాసముంచుట ద్వారా ఆ ప్రణాళికను స్వీకరించు. అయితే సాతాను కూడా నీ పట్ల ప్రణాళిక కలిగియున్న విషయాన్ని ఎన్నటికి మరువద్దు. భయము ద్వారా దాని ప్రణాళిక నీవు పొందుకొనెదవు.

❤ "నేను యెహోవా యొద్ద విచారణ చేయగా, ఆయన నాకుత్తరమిచ్చెను. నాకు కలిగిన భయములన్నిటినుండి ఆయన నన్ను తప్పించెనని" కీర్తనకారుడైన దావీదు 34:4లో చెప్పుచున్నాడు.

యేసు నీ విమోచకుడు. నీవు శ్రద్ధగా ఆయనను వెదకినట్లయితే, నీకున్న ప్రతి భయమునుండి నిన్ను విడిపించును. యోహాను 14:27లో భయముతోనున్న శిష్యులతో యేసు ఇలా అంటున్నాడు. ❤ "మీ హృదయమును కలవరపడ నియ్యకుడి, వెరవనియ్యకుడి (ఆందోళన, కలవరమును నీ యొద్దకు రానివ్వవద్దు. భయము, పిరికితనము మిమ్మును అస్థిరపరచనివ్వవద్దు)."

భయానికి విరుద్ధంగా నీవు స్థిరమైన నిర్ణయము తీసుకోవాలని దాని అర్థము. పిరికి ఆత్మ నీ జీవితముపై ఎటువంటి ఆధిపత్యము చేయకుండునట్లుగా ఈ దినమే నిర్ణయము తీసుకొనుము.

కీర్తనలు 56:3,4 వచనముల యందు దావీదు ప్రభువు గూర్చి ఇలా అంటున్నాడు:

❤ నాకు భయము సంభవించు దినమున నిన్ను ఆశ్రయించు చున్నాను. దేవుని (సహాయమును) బట్టి నేను ఆయన వాక్యమును కీర్తించెదను.

దేవునియందు నమ్మికయుంచియున్నాను. నేను భయపడను. శరీరధారులు నన్నేమి చేయగలరు?

యెషయా 41:10 యందు ప్రభువు తన ప్రజలకు అభయమిచ్చుచున్నాడు. "భయపడకుము (భయపడుట ఏమియు లేదు) నేను నీకు తోడైయున్నాను. దేవుడనైయున్నాను దిగులుపడకుము నేను నిన్ను బలపరతును. నీకు సహాయము చేయువాడను నేనే. నీతియను నా దక్షిణహస్తముతో నిన్ను ఆదుకొందును."

భూ సంబంధమైన భద్రత మరియు సంపదలకు ప్రయాసపడే మనకు హెబ్రీ గ్రంథకర్త 13:5లో ఈ హెచ్చరిక ఇచ్చుచున్నాడు. ❤ "ధనాపేక్షలేనివారై మీకు కలిగిన వాటితో తృప్తి పొందుడి నిన్ను మాత్రము విడువను. నిన్ను ఎడబాయను అని ఆయనే (దేవుడే) చెప్పెను గదా!"

❤ "ప్రభువు నాకు సహాయుడు. నేను భయపడను నరమాత్రుడు నాకేమి చేయగలడు? అని మంచి ధైర్యముతో చెప్పగల వారమై యున్నామని" గ్రంథకర్త తదుపరి 6వ వచనములో చెప్పుచున్నాడు.

భయము అనగా తప్పుడు సాక్షము వాస్తవంగా కనిపించుట. భవిష్యత్‌లో నీవు విఫలము చెందుతావు అని చెప్పుటకు నీ ప్రస్తుత పరిస్థితులు ఎలా వున్నా, ఎంత చెడ్డగా కనిపించినా దేవునికి అసాధ్యమైనదేదియు లేదని బైబిలు చెప్పుచున్నది (మార్కు 9:17-23).

❤ "నీ దేవుడనైన యెహోవానగు నేను భయపడకుము నేను నీకు సహాయము చేసెదనని చెప్పుచూ నీ కుడి చేతిని పట్టుకొనుచున్నాను" అని యెషయా 41:13లో ప్రభువు అంటున్నాడు. చెడు వార్తలు వినునప్పుడు నీవు

భయపడనక్కరలేదని దీని అర్థము. దేవుని యందు విశ్వాసముంచు సమస్తము నీ మంచి కొరకే జరుగును.

"దేవుని ప్రేమించువారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగుచున్నవని" పౌలు రోమా 8:28లో మనకు గుర్తు చేయుచున్నాడు.

యెషయా 43:1-3లో ఇలా చెప్పబడినది. ❤ "అయితే యాకోబూ, నిన్ను సృజించినవాడగు యెహోవా, ఇశ్రాయేలూ నిన్ను నిర్మించినవాడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు. నేను నిన్ను విమోచించియున్నాను. భయపడకుము, పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను. నీవు నా సొత్తు. నీవు జలములలో బడి దాటునప్పుడు నేను నీకు తోడైయుందును. నదులలో బడి వెళ్లునప్పుడు అవి నీమీద పొర్లిపారవు. నీవు అగ్ని మధ్యను నడచుచున్నప్పుడు కాలిపోవు, జ్వాలలు నిన్ను కాల్చవు. యెహోవానగు నేను నీకు దేవుడను, ఇశ్రాయేలు పరిశుద్ధదేవుడనైన నేను నిన్ను రక్షించువాడను".

భయముపై ఉన్న లేఖనాలను బిగ్గరగా ఒప్పుకొనుట నేర్చుకొని నీవు ఒంటరిగా వున్నప్పుడు వాటిని వాతావరణములో బిగ్గరగా పలుకు. భయమునందు నీవు జీవింప నిష్టపడటము లేదన్న విషయాన్ని ఆత్మకు సంబంధించిన లోకములో స్థిరపరచుము. ఇలా దేవుని వాక్యము ప్రకటించుట ద్వారా బాధాకరమైన జీవితము నీవు జీవించుటకు ఇష్టపడటము లేదన్న సంగతి నీవు అపవాదికి తెలియజేయు చున్నావు.

భయము యందు హింసకలదని (1 యోహాను 4:18)లో బైబిలు చెప్పుచున్నది. ఎఫెసీ. 3:12,13 ప్రకారము యేసు ఆ హింస నుండి విడిపించుటకు చనిపోయినాడని, క్రీస్తునందున్న విశ్వాసము ద్వారా మనము ధైర్యవంతులుగా చేయబడినట్లు పౌలు తెలుపుచున్నాడు.

❤ ...ఆయన యందలి విశ్వాసము చేత ధైర్యమును నిర్భయమైన (ఎటువంటి భయము లేకుండా, స్వతంత్రంగా ఆయన వద్దకు వెళ్ళే) ప్రవేశమును ఆయనను బట్టి మనము కలిగియున్నాము.

కాబట్టి మీ నిమిత్తమై నాకు వచ్చిన శ్రమలను చూచి మీరు అధైర్యపడవద్దని వేడుకొనుచున్నాను.

❤ దేవుడు మనకు ఆశ్రయ దుర్గమై యున్నాడు. (బలమైన శోధనాభేద్యమైన) ఆపత్కాలములో ఆయన నమ్ముకొనదగిన సహాయకుడు. కావున భూమి మార్పు నొందినను నడి సముద్రములలో పర్వతములు మునిగినను మనము భయపడమని కీర్తనాకారుడు 46:1,2 వచనాలను తెలియజేయుచున్నాడు.

యెహెూషువ 1వ అధ్యాయములో దేవుడు ఈ మాటలతో యెహెూషువను మరల మరల ప్రోత్సహించుచున్నాడు. ❤ "నిబ్బరము కలిగి ధైర్యముగా నుండుము" (6) ❤ "నీ దేవుడైన యెహోవా నీకు తోడై యుండును కనుక నీవు భయపడనక్కరలేదు. యెహెూషువకిచ్చిన సందేశాన్ని దేవుడు నీకిచ్చుచున్నాడు."

దేవుడు నీతో వున్నాడు. నిన్ను విడువడు. నిన్ను ఎడబాయడు (హెబ్రీయులకు 13:5) అన్నివేళల ఆయన దృష్టి నీపై కలదు. (కీర్తనలు 33:18) ఆయన తన అరచేతులమీద నిన్ను చెక్కుకొని యున్నాడు (యెషయా 49:16). కాబట్టి నీవు భయపడనవసరము లేదు. ధైర్యముగా నిశ్చింతగా, నిబ్బరము కలిగి వుండి భయపడకుము.

❤ "రేపటిని గూర్చి చింతింపకుడి; రేపటి దినము దాని సంగతుల గూర్చి చింతించును; ఏనాటి కీడు ఆనాటికి చాలునని" తన అనుచరులకు యేసు మత్తయి 6:34లో బోధించినాడు.

సముద్రముపై వచ్చిన తుఫాను చూచి శిష్యులు ఎలా భయపడిరి అను విషయము మత్తయి 8:23-27లో కనబడుచున్నది. ❤ "అందుకాయన అల్ప విశ్వాసులారా! యెందుకు భయపడుచున్నారని వారితో చెప్పి లేచి గాలిని గద్దింపగా మిక్కిలి నిమ్మళమాయెను (సంపూర్ణ సమాధానము)."

❤ "చింతించుట వలన ప్రయోజనమేమి? అది నీకు ఏ మంచిని చేయును? నీ జీవిత వ్యవధిని ఒక్కరోజునైనా పొడిగింప గలదా?" అని యేసు లూకా 12:25, 26లో ప్రశ్నించుచున్నాడు. లేదు! కాబట్టి అన్నిటికంటె తక్కువైనవి మీచేత కాకపోతే తక్కిన వాటిని గూర్చి మీరు చింతింపనేల?

యెషయా 54:4లో భయపడకుము అని చెప్పబడినది ❤ "నీవు ఇక ఎన్నటికిని సిగ్గు పడనక్కరలేదు, అవమానము తలంచుకుము నీవు లజ్జ పడనక్కరలేదు. నీ బాల్యకాలపు సిగ్గును మరచుదువు. నీ వైధవ్యపు నిందను ఇక మీదట జ్ఞాపకము చేసికొనవు. నిన్ను సృష్టించిన వాడు నీకు భర్తయై యున్నాడు. ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడు నీ విమోచకుడు సర్వలోకమునకు దేవుడని ఆయనకు పేరు."

❤ "తత్తరిల్లు హృదయములతో ఇట్లనుడి, భయపడక ధైర్యముగా ఉండుడి, ప్రతిదండన చేయుటకై మీ దేవుడు వచ్చుచున్నాడు. ప్రతిదండనను దేవుడు చేయదగిన ప్రతీకారమును ఆయన చేయును. ఆయన వచ్చి తానే మిమ్మును రక్షించునని" యెషయా 35:4లో వ్రాయబడినది.

భయము అను శోధనలో పడకుండునట్లు తన శక్తితో బలముతో నింపమని ఆయనను వేడుకొనుము (ఎఫెసీ. 3:16).

భయమును గూర్చి దేవుడు నాకు బయలుపర్చిన ఒక గొప్ప ప్రత్యక్షతను మీతో పంచుకోవాలని ఆశించుచున్నాను. ❤ "భయపడకుము" అని తన వాక్యము ద్వారా మాట్లాడునప్పుడు భయపడవద్దని దేవుడు ఆజ్ఞ ఇచ్చుట లేదుకాని, ఆయన వాస్తవంగా చెప్పేది ఏమిటంటే, భయముతో సాతాను నీపై దాడి చేసినప్పుడు

వెనక్కు తగ్గక లేక పారిపోక, భయము కలిగినను వానికెదురుగా వెళ్లుమని ఆయన చెప్పుచున్నాడు.

భయపడినప్పుడల్లా నేను పిరికిదానను అని చాలా సంవత్సరాలు భావించినాను. అయితే దానిని అధిగమించే మార్గాలు ఇప్పుడు నేర్చుకొనినాను, అదేమనగా అపవాదిని ఎదిరించి దేవుడు నీతో చెప్పమన్న ప్రతి విషయాన్ని నీవు భయానక స్థితిలో వున్నను చెప్పవలెను.

కీర్తనలు 34:4లో దావీదు ప్రభువును గూర్చి ఇలా అంటున్నాడు. ❤ "నేను యెహోవా యొద్ద విచారణ చేయగా, ఆయన నాకుత్తరమిచ్చెను." నాకు కలిగిన భయములన్నిటిలో నుండి ఆయన నన్ను తప్పించెను. "ప్రేమలో భయముండదు. అంతేకాదు పరిపూర్ణ (సంపూర్ణ పూర్తిగా పరిపక్వమైన) ప్రేమ భయమును వెళ్లగొట్టును. భయము దండనతో కూడినది; భయపడువాడు ప్రేమ యందు పరిపూర్ణము చేయబడినవాడు కాదని" (1 యోహాను 4:18)లో యోహాను ఈ విషయాన్ని గుర్తుచేయుచున్నాడు.

దేవుడు నిన్ను ప్రేమించుచున్నాడన్న విషయము మరువవద్దు. నిన్ను సంపూర్ణ ప్రేమతో ప్రేమించి నీ పట్ల శ్రద్ధ కలిగియున్నాడు కనుక నీవు భయము నుండి విడుదలపొంది జీవించవచ్చు.

ప్రస్తుతము నీకు చాలా భయాలుండుట వలన దాని నుండి స్వేచ్ఛగా జీవించుట నీకు అసాధ్యమనిపించవచ్చు. అలాగైతే ఒకే విషయాన్ని గుర్తుంచు కొనుము. ఎటువంటి సమస్యనుండైనా దేవుడు నిన్ను ఒక్కసారే విడిపించగలడు. కాని కొన్నిసార్లు క్రమక్రమంగా నీకు విడుదల నిస్తాడు. దేవుడు నీయందు క్రియ జరిగించుచున్నాడు కాబట్టి నీవు ధైర్యముగా నుండుము. నీ యందు సత్క్రియనారంభించిన దేవుడు, దానిని కొనసాగించగల సమర్థుడు కూడా (ఫిలిప్పీ. 1:6).

❤ యెహోవా నాకు వెలుగును రక్షణయునై యున్నాడు. నేను ఎవరికి భయపడుదును? అని కీర్తనకారుడు 27:1లో అంటున్నాడు. ❤ "నా శరీరమాంసము తినుటకై దుష్టులు నా మీదికి వచ్చినప్పుడు వారు తొట్రిల్లి కూలిరి."

ఆపత్కాలమున ఆయన తన పర్ణశాలలో నన్ను దాచును. ఆయన ఆశ్రయ దుర్గము మీద నన్ను ఎక్కించును. నా శత్రువుల కంటే ఎత్తుగా నా తల ఎత్తబడును. అప్పుడు ఉత్సాహధ్వని చేయుచు, బలులు అర్పించి, యెహోవా గూర్చి పాడెదనని 5 మరియు 6 వచనాలలో కీర్తనాకారుడు చెప్పుచున్నాడు.

రాజైన దావీదునకు చేసినది దేవుడు నీకును చేయగలడు. నీ విశ్వాసము దేవుని యందుంచుము. సమస్త భయముల నుండి నిన్ను విడిపించుటకు ఆయన సమర్థుడు.

నీ ప్రార్థనలు ఆలకింపబడినవని అభయమిస్తూ దానియేలుతో దేవదూత మాట్లాడిన మాటలు ఆలకించుడి ❤ "అప్పుడతడు – దానియేలు, భయపడకుము నీవు తెలిసికొనవలెనని నీ మనస్సును అప్పగించి, దేవుని యెదుట నిన్ను తగ్గించుకొనిన ఆ మొదటి దినము మొదలుకొని నీవు చెప్పిన మాటలు వినబడినవి కనుక నీ మాటలను బట్టి నేను వచ్చితిని" (దాని. 10:12)

దేవుడు నీ ప్రార్థన వినలేదనియు దానికి ఆయన జవాబు దయచేయడని చెప్పుటకు అపవాది ప్రయత్నము చేయును. దేవుని వాక్యము ఆత్మ ఖడ్గమని గుర్తుంచుకొనుడి. (ఎఫెసీ. 6:17). వాక్య ఖడ్గముతో నీవు శత్రువును ఓడించెదవు. ఈ వాక్యాలు నీ హృదయములో భద్రపరచుకొని వాటిని దివారాత్రము ధ్యానించుము.

దేవుని వాక్యముతోనే శత్రువును ఓడించగలవు. వాక్యము తెలిసినప్పుడే సాతాను అబద్ధాలను గుర్తించగలవు. దేవుని వాక్యాన్ని ఒప్పుకొనినట్లయితే అది నిన్ను విజయపథమున నడిపిస్తుంది.

నీపై అధికారములో వున్న వారితో మాట్లాడాలంటే బహుశా నీకు భయము కలగవచ్చు. నీమీద నేరారోపణ చేయబడినప్పుడు, అధికారుల సమక్షములో నిన్ను నీవు సంరక్షించుకొనుటకు ఏమి చెప్పాలో అన్న భయము ఒకవేళ నీకుండవచ్చు. అయితే లూకా 12:11,12 వచనాలలో వున్న యేసు మాటలు వినుము. ❤ "వారు సమాజ మందిరముల పెద్దల యొద్దకును, అధిపతుల యొద్దకును, అధికారుల యొద్దకును మిమ్మును తీసికొని పోవునప్పుడు మీరు ఏలాగు ఏమి ఉత్తరమిచ్చెదమో, యేమి మాటలాడుదుమో అని చింతింపకుడి! మీరేమి చెప్పవలసినదియు పరిశుద్ధాత్మ ఆ గడియలోనే మీకు నేర్పును!"

భయము శోధన నీకు కలిగినప్పుడు, విశ్వాస ఒప్పుకోలుగా, దైవానుగ్రహముగా, ఆయన నీ పట్లను చూపిన శ్రద్ధను గుర్తు చేసుకుంటూ కీర్తనలు 23:1-6 పలుమార్లు చెప్పుము.

> ❤ యెహోవా నా కాపరి, నాకు లేమి కలుగదు. పచ్చికగల చోట్లను ఆయన నన్ను పరుండజేయుచున్నాడు. శాంతికరమైన జలములయొద్ద నన్ను నడిపించుచున్నాడు. నా ప్రాణమునకు ఆయన సేదదీర్చుచున్నాడు. తన నామమునుబట్టి నీతి మార్గములలో నన్ను విడిపించుచున్నాడు. గాడాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడై యుందువు. నీ దుడ్డుకఱ్ఱయు నీ దండమును నన్ను ఆదరించును. నా శత్రువులయెదుట నీవు నాకు భోజనము సిద్ధపరచుదువు, నూనెతో నా తల అంటియున్నావు. నా గిన్నె నిండి పొర్లుచున్నది. నేను బ్రదుకు దినములన్నియు కృపా క్షేమములే నా వెంట వచ్చును, చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను.

# ముగింపు: నిలకడగా ఉండు!

దేవుని ప్రేమ ఆయన మన కొరకు దాచివుంచిన అద్భుత భవిష్యత్తు. క్రీస్తునందు నీతి, భయమునుండి స్వతంత్రతకు సంబంధించిన లేఖనాలు ఈ పుస్తకములో మీతో పంచుకొనుచున్నాను.

లేఖనములయందున్న ప్రతి వాగ్ధానము ప్రభువు సేవకునివైన నీ స్వాస్థ్యము. అయితే అపవాది వాటిని నీ యొద్ద నుండి దొంగిలించ ప్రయత్నము చేయునన్న సంగతి నీవు గ్రహించాలి. దాస్యత్వమునకు నీవు తిరిగి వెళ్ళాలనునదే అపవాది కోరిక.

అందుచేత గలతీ. 5:1 పౌలు ఇలా అంటున్నాడు. ❤ "ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి, క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసియున్నాడు. కాబట్టి మీరు స్థిరముగా నిలిచి మరల దాస్యమను కాడిక్రింద చిక్కుకొనకుడి".

విజయవంతమైన క్రైస్తవ జీవితానికి, నిలకడ, సహనము మరియు ఓర్పు అనునవి తాళపు చెవులు (ప్రాముఖ్యమైన విషయాలు):

> ❤ "కాబట్టి మీ ధైర్యమును విడిచిపెట్టకుడి. దానికి ప్రతిఫలముగా గొప్ప బహుమానము కలుగును"

"మీరు దేవుని చిత్తమును నెరవేర్చినవారై, వాగ్దానము పొందు నిమిత్తము మీకు ఓరిమి అవసరమై యున్నది."
హెబ్రీయులకు 10:35,36

క్రీస్తు రక్తము ద్వారా కొనబడిన దానిని నీవు పూర్తిగా ఆనందించాలని పరలోకపు తండ్రి కోరుకొనుచున్నాడు. పట్టుదల కలిగియుండుము. నేను ఎన్నటికిని 'విడిచిపెట్టను' అన్న తీర్మానము ఇప్పుడే చేయుము. ముందున్న లేఖన భాగాలు జీవితములో భాగమయ్యేంతవరకు నీ నోటితో వాటిని ఒప్పుకొనుము.

ఆయన వాక్యమందు జీవమున్నదని, ఆయన నిన్ను ప్రేమించుచున్నాడన్న విషయాన్ని నిత్యము గుర్తుంచుకొనుము.

# లేఖనాల ఒప్పుకోళ్ళు

## ఉపోద్ఘాతము: దేవుని వాక్యము

ఆయన తన వాక్కును పంపి నన్ను బాగు చేసెను. ఆయన నేను పడిన గుంటలలో నుండి నన్ను విడిపించెను. (కీర్తనలు 107:20)

దుష్టుల (సలహాలు, ఉద్దేశ్యాలు, ప్రణాళికలు) ఆలోచన చొప్పున నడువక పాపుల మార్గమున నిలువక (వారితో విశ్రమించక) అపహాసకులు కూర్చుండు చోట కూర్చుండని నేను ధన్యుడను (సంతోషించువాడను, అదృష్టవంతుడను, కోరదగిన వాడను మరియు జయశీలుడును).

అయితే నా ఆనందము నా కోరిక ఆయన ధర్మశాస్త్రము (బోధనలు, ఉపదేశములు, ఆజ్ఞల) యందున్నవి. నేను దానిని దివారాత్రము ధ్యానించెదను (పఠించి, ధ్యానించెదను).

నేను నీటి కాలువల యోరను నాటబడిన చెట్టువలె వుండి, ఆకు వాడక తగిన కాలమందు ఫలమిచ్చెదను. నేను చేయునదంతయు సఫలమగును. (పరిపక్వము చెందును) కీర్తనలు 1:1,3.

ఈ ధర్మశాస్త్రగ్రంథము నా నోటి నుండి తప్పిపోదు. దానిలో వ్రాయబడిన వాటన్నిటిప్రకారము చేయుటకు నేను జాగ్రత్తపడునట్లు దివారాత్రము దాని ధ్యానించినయెడల అప్పుడు నా మార్గమును వర్థిల్ల జేసికొని చక్కగా ప్రవర్తించెదను. (యెహోషువ 1:8).

నేను దానిననుసరించుటకు ఆ మాట నాకు బహు సమీపముగానున్నది. నా హృదయమున నా నోట నున్నది. (ద్వితీ. 30:14).

నిష్ఫలముగా నాయొద్దకు మరలక (ఫలము) లేకుండ, వ్యర్థముగా అది నాకు అనుకూలమైనదాని నెరవేర్చును. నేను పంపిన కార్యమును సఫలము చేయును. (యెషయా 55:11).

ఎందుకనగా నేను ముసుకులేని ముఖముతో ప్రభువుయొక్క మహిమ (వాక్యమందు) అద్దమువలె ప్రతిబింపజేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాను. (2 కొరింథీ. 3:18).

దేవుని వాక్యము సత్యమైయున్నది. నేను దానిని ధ్యానించునప్పుడు అది సత్యమని తెలుసుకొని మరియు ఆ సత్యము నన్ను స్వతంత్రునిగా చేయును. (యోహాను 17:17, 8:32).

## 1వ అధ్యాయము: దేవుని ప్రేమ

అయినను నన్ను ప్రేమించినవానిద్వారా నేను వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాను.

మరణమైనను జీవమైనను దేవదూతలైనను ప్రధానులైనను ఉన్నవియైనను రాబోవునవియైనను అధికారులైనను ఎత్తయినను లోతైనను సృష్టింప బడిన మరి ఏదైనను, నా ప్రభువైన క్రీస్తు యేసు నందలి దేవుని ప్రేమ

నుండి నన్ను ఎడబాప నెరవని రూఢిగా (నిశ్చయముగా) నమ్ముచున్నాను. (రోమా 8:37-39).

దేవుడు నన్ను ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ (ఏకైక) కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు (నమ్మికయుంచు, హత్తుకొను, ఆధారపడు) నేను నశింపక (నాశనముకుపోక, తప్పిపోక) నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. (యోహాను 3:16).

మీరు నన్ను ప్రేమించి నేనే దేవుని యొద్దనుండి బయలుదేరి వచ్చితినని నమ్మితిరి గనుక తండ్రి తానే మిమ్మును ప్రేమించుచున్నాడు. (యోహాను 16:27).

ఎందుకంటే యేసు ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనుచున్న నేను (వాస్తవంగా) యేసును ప్రేమించుచున్నాను గనుక నా పరలోకపు తండ్రి మరియు యేసు వలన ప్రేమింపబడుచున్నాను. నేనును ఆయనను ప్రేమించి ఆయనకు నన్ను నేను కనబరచుకొందును. (యోహాను 14:21).

ఆయనే మొదట నన్ను ప్రేమించెను. గనుక నేను ఆయనను ప్రేమించు చున్నాను. (1 యోహాను 4:19).

దేవా నీ కృప ఎంత అమూల్యమైనది. నేను నీ రెక్కల నీడను ఆశ్రయించు చున్నాను. (కీర్తనలు 36:7).

యెహోవా, నీవు నన్ను పరిశోధించి తెలిసికొని యున్నావు. నేను కూర్చుండుట నేను లేచుట నీకు తెలియును. నాకు తలంపు పుట్టకమునుపే నీవు నా మనస్సును గ్రహించుచున్నావు. నా నడకను నా పడకను నీవు పరిశీలనచేసియున్నావు. నా చర్యలన్నిటిని నీవు బాగుగా తెలిసికొనియున్నావు. యెహోవా, మాట నా నాలుకకు రాకమునుపే అది నీకు పూర్తిగా తెలిసియున్నది. వెనుకను ముందును నీవు నన్ను ఆవరించియున్నావు. నీ చేయి నామీద ఉంచియున్నావు. ఇట్టి తెలివి నాకు మించినది. అది అగోచరము. అది నాకందదు. నీ ఆత్మయొద్దనుండి నేనెక్కడికి పోవుదును! నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును?

దేవా నీ తలంపులు నాకెంత ప్రియమైనవి. వాటి మొత్తమెంత గొప్పది. వాటిని లెక్కించెద ననుకొంటినా అవి యిసుక కంటెను లెక్కకు ఎక్కువై యున్నవి. నేను మేల్కొంటినా యింకను నీ యొద్దనే యుందను. (కీర్తనలు 139:1-7,17,18).

కావున నాయందు దయచూపవలెనని (ఎదురు చూచుచు, వాంఛించుచు, ఆశించుచు) యెహోవా ఆలస్యముచేయుచున్నాడు. నన్ను కరుణింపవలెనని ఆయన నిలువబడి యున్నాడు. యెహోవా న్యాయముతీర్చు దేవుడు. నేను ఆయన (ఆయన విజయము, దయ, ప్రేమ, సమాధానము, సంతోషము, మరియు సాటిలేని ఆయన సహవాసము) నిమిత్తము కనిపెట్టుకొను నేను ధన్యుడను (సంతోష పరుడను, అదృష్టవంతుడను. కోరదగిన వాడను) (యెషయా 30:18).

దేవుడు నన్ను అనాథగా (ఆదరణలేని వానిగా, ఒంటరిగా, దుఃఖితునిగా నిస్సహాయునిగా మరియు దిక్కుమాలినవానిగా) విడువడు. ఆయన నా యొద్దకు (మరల) వచ్చును. (యోహాను 14:18).

నా తలిదండ్రులు నన్ను విడిచినను యెహోవా (తన బిడ్డవలె) నన్ను చేరదీయును. (కీర్తనలు 27:10).

విశ్వాసముద్వారా క్రీస్తు నా హృదయమందు (స్థిర నివాసము ఏర్పరచుకొని, హత్తుకొని, శాశ్వత గృహము చేసికొని) నివసించును. ఆయన ప్రేమయందు వేరు పారి స్థిరపడి భద్రముగా నున్నాను.

సమస్త పరిశుద్ధులతో (ఆ ప్రేమననుభవించిన దైవజనులతో) కూడా దాని వెడల్పు, పొడుగు, లోతు, ఎత్తు ఎంతో గ్రహించగల శక్తి నాకున్నది.

జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును (ఆచరణాత్మకంగా అనుభవించుటకు) తగిన శక్తిగలవారు కావలెననియు నేను ప్రార్థించుచున్నాను. (ఎఫెసీ. 3:17-19).

తండ్రి యేసును ఎలాగు ప్రేమించెనో యేసు నన్ను అలాగుననే ప్రేమించు చున్నాడు. కాబట్టి ఆయన ప్రేమ యందు నేను నిలిచి యుందును. ఆయన ప్రేమకు కొలమానము ఇదే. తన స్నేహితుని కొరకు ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగల వాడెవడును లేదు; (యోహాను 15:9,13).

ఎట్లనగా నేనింకను పాపినై యుండగానే క్రీస్తు (అభిషిక్తుడైన మెస్సీయా) నా కొరకు చనిపోయెనన్న వాస్తవము నా పట్ల దేవునికున్న ప్రేమను వెల్లడి పరచుచున్నది. (రోమా 5:8).

దేవుని కృపా మహాదైశ్వర్యమును బట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తము వలన నాకు విమోచనము అనగా నా అపరాధములకు క్షమాపణ నాకు కలిగియున్నది. (ఎఫెసీ. 1:7).

పర్వతములు తొలగిపోయినను మెట్టలు తత్తరిల్లినను ఆయన కృప దయ నన్ను విడిచిపోదు. సమాధాన విషయమైన ఆయన నిబంధన తొలగిపోదు. అని నా యందు జాలిపడు యెహోవా సెలవిచ్చుచున్నాడు. (యెషయా 54:10).

దేవుడు నమ్మతగినవాడు (ఆధారభూతుడు), విశ్వాసనీయుడు, మరియు వాగ్ధానానికి కట్టుబడి వుండువాడు కనుక నేను ఆయనపై ఆధారపడెదను. (1 కొరింథీ. 1:9).

నా ప్రాణమా యెహోవాను సన్నుతించుము. (ప్రేమ, కృతజ్ఞతతో) నా అంతరంగమున నున్న సమస్తమా ఆయన పరిశుద్ధ నామమును సన్నుతించుము!

నా ప్రాణమా యెహోవాను సన్నుతించుము. (ప్రేమ, కృతజ్ఞతలతో) ఆయన చేసిన ఉపకారములలో దేనిని (ఒక్కదానిని కూడా) మరువకుము. నా దోషములన్నింటిని క్షమించువాడు.

నా సంకటములన్నిటినీ కుదుర్చువాడు సమాధిలో నుండి నా ప్రాణమును విమోచించుచున్నాడు. కరుణా కటాక్షములను నాకు కిరీటముగా వుంచుచున్నాడు. (కీర్తనలు 103:1-4).

పక్షిరాజు యవ్వనమువలె నా యవ్వనము క్రొత్తదగునట్లు మేలుతో నా హృదయమును తృప్తి పరచుచున్నాడు.

ఆయన నీతిక్రియలను జరిగించుచు బాధింపబడు వారికందరికి న్యాయము తీర్చును. ఆయన దయాదాక్షిణ్య పూర్ణుడు. దీర్ఘశాంతుడు కృపా సమృద్ధి కలవాడు. ఆయన ఎల్లప్పుడు వ్యాజ్యమాడువాడుకాదు. ఆయన నిత్యము కోపించువాడు కాడు. భూమి కంటె ఆకాశము ఎంత ఉన్నతముగా ఉన్నదో ఆయన యందు భయభక్తులు గలవారి యెడల ఆయన కృప అంత అధికముగా ఉన్నది. పడమటికి తూర్పు ఎంత దూరమో ఆయన నా అతిక్రమములను నాకు అంత దూరపరచి యున్నాడు. తండ్రి తన కుమారుని యెడల జాలిపడునట్లు యెహోవా తన యందు భయభక్తులు గలవారి యెడల జాలిపడును.

ఆయన కృప యుగయుగములు నిలుచును. (కీర్తనలు 103:5, 6,8,9,11-13,17).

యెహోవా యందు నేను నమ్మిక యుంచినాను గనుక ఆయన ప్రేమ నన్ను ఆదరించి యున్నది. (కీర్తనలు 32:10).

నేనెల్లప్పుడు యెహోవాను సన్నుతించెదను. నిత్యము ఆయన కీర్తి నా నోటనుండును. యెహోవానుబట్టి నేను అతిశయించుచున్నాను. దీనులు దానిని విని సంతోషించెదరు. నాతోకూడి యెహోవాను ఘనపరచుడి మనము ఏకముగా కూడి ఆయన నామము గొప్ప చేయుదుము.

నేను యెహోవా యొద్ద విచారణ చేయగా, ఆయన నాకుత్తరమిచ్చెను. నాకు కలిగిన భయములన్నిటిలో నుండి ఆయన నన్ను తప్పించెను. నేను ఆయన తట్టు చూడగా, నాకు వెలుగు కలిగెను. నా ముఖము ఎన్నడును లజ్జింపక పోవును. ఈ దీనుడు మొఱ్ఱ పెట్టగా యెహోవా ఆలకించెను. నా శ్రమలన్నిటిలో నుండి ఆయన రక్షించెను. యెహోవా యందు భయభక్తులు గల నా చుట్టు ఆయన దూత కావలి యుండి నన్ను రక్షించును.

యెహోవా ఉత్తముడని రుచి చూచి తెలిసికొనుడి. ఆయనను ఆశ్రయించు నరుడు ధన్యుడు. (కీర్తనలు 34:1-8).

## 2వ అధ్యాయము: నీ భవిష్యత్

బాధపడువాని దినములన్నియు శ్రీకరములు, సంతోష హృదయునికి నిత్యము ఆనందము (ఎటువంటి పరిస్థితులలోనైనా) కలుగును. (సామెతలు 15:15).

సజీవుల దేశమున నేను యెహోవా దయను పొందుదునన్న నమ్మకము నాకు లేనియెడల నేనేమవుదును?

యెహోవా కొరకు కనిపెట్టుకొని యుందును. నేను ధైర్యము తెచ్చుకొని నా హృదయమును నిబ్బరముగా నుంచుకొందును. యెహోవా కొరకు కనిపెట్టుకొని యుందును. (కీర్తనలు 27:13,14).

దేవుడు నా యెడల ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును. రాబోవు కాలమందు మాకు నిరీక్షణ కలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశ్యములేగానీ హానికరమైనవికావు. (యిర్మీయా 29:11).

నా ప్రాణమా, నాలో నీవేల కృంగియున్నావు? నాలో నీవేల తొందర పడుతున్నావు? దేవునియందు నిరీక్షణయుంచుము. ఆయన నా రక్షణకర్త నా దేవుడు ఇంకను నేనాయనయందు సంతోషించుచున్నాను. (కీర్తనలు 42:11).

ఈ నిరీక్షణ నన్ను సిగ్గుపరచదు ఎందుకనగా నాకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ నా హృదయములో కుమ్మరింపబడియున్నది. (రోమా 5:5).

దేవుడైన యెహోవా సూర్యుడును కేడెమునైయున్నాడు. యెహోవా కృపను ఘనతయు అనుగ్రహించును. యదార్థముగా ప్రవర్తించువారికి ఆయన యే మేలును చేయక మానడు. (కీర్తనలు 84:11).

నాలో సత్క్రియనారంభించినవాడు యేసుక్రీస్తు దినము (ఆయన రాకడ దినము) వరకు దానిని కొనసాగించునని రూఢిగా నమ్ముచున్నాను. (ఫిలిప్పీ. 1:6).

మరియు వాటియందు నేను నడచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన (ఉద్దేశించిన) సత్క్రియలు చేయుటకై నేను క్రీస్తుయేసునందు సృష్టింపబడినవాడనై ఆయన చేసిన పనియైయున్నాను (ఎఫెసీ. 2:10).

ప్రతి ప్రయత్నమునకు ప్రతి క్రియకును తగిన (నిర్ణీత) సమయము కలదు. కాబట్టి ఆయన నన్ను హెచ్చించులాగున దేవుని బలిష్టమైన చేతిక్రింద దీనమనస్కుడనై యుందును. (ప్రసంగి 3:17, 1 పేతురు 5:6).

ఆ దర్శన విషయము నిర్ణయ కాలమున జరుగును. సమాప్తమగుటకై ఆతురపడుచున్నది. అది తప్పక నెరవేరును. అది ఆలస్యముగా వచ్చినను దాని కొరకు నేను కనిపెట్టెదను అది తప్పక జరుగును. జాగు చేయకవచ్చును. (హబక్కూకు 2:3).

నా యెదుట ఉంచబడిన నిరీక్షణను చేపట్టుటకు శరణాగతుడనై నాకు బలమైన ధైర్యము కలుగునట్లు ప్రమాణము చేసిన వాగ్ధానమును దృఢముగా నమ్మెదను. ఈ నిరీక్షణ నిశ్చలమును, స్థిరమునై నా ఆత్మకు లంగరువలె నున్నది. (హెబ్రీ. 6:18,19).

దేవుని ప్రేమించువారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవన్న నిశ్చయత నేను కలిగియున్నాను. (రోమా 8:28).

నాలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున నేను అడుగు వాటన్నిటికంటెను ఊహించు వాటన్నిటికంటెను (నా ప్రార్థనలు, కోరికలు, తలంపులు, స్వప్నములు) అత్యధికముగా చేయగల శక్తి నా దేవునికున్నది. (ఎఫెసీ. 3:20).

మరియు క్రీస్తునందు ముందుగా నిరీక్షించిన నేను తన మహిమకు కీర్తి కలుగ జేయవలెనని దేవుడు తన చిత్త ప్రకారమైన సంకల్పమునుబట్టి నన్ను ముందుగా నిర్ణయించి ఏర్పరచి, ముందుగా నియమించి, ఆయన (దేవుని) యందు స్వాస్థ్యముగా, భాగముగా ఏర్పరచెను. ఆయన తన చిత్తానుసారముగా చేసిన నిర్ణయము చొప్పున సమస్త కార్యములను జరిగించుచున్నాను. (ఎఫెసీ. 1:11).

ఈ ధర్మ శాస్త్ర గ్రంథము నా నోటి నుండి తప్పిపోకూడదు. దానిలో వ్రాయబడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నేను జాగ్రత్తపడునట్లు దివారాత్రము దానిని ధ్యానించిన యెడల నా మార్గము వర్ధిల్ల చేసుకొని చక్కగా ప్రవర్తించెదను. (యెహోషువ 1:8).

నేను దానిననుసరించుటకు ఆ మాట నాకు బహు సమీపముగా నున్నది. నా హృదయమున నా నోటనున్నది. (ద్వితీ. 30:14).

అలాగే నా నోట నుండి వచ్చు వచనము నిష్ఫలముగా నా యొద్దకు మరలక అది నాకు అనుకూలమైన దానిని నెరవేర్చును. నేను పంపిన కార్యము సఫలము చేయును. (యెషయా 55:11).

కావున నేను ముసుకు లేని ముఖముతో ప్రభువు యొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు (దేవుని వాక్యమందు) మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాను. (2 కొరింథీ. 3:18).

నేను ఈ లోక మర్యాద (బాహ్యాచారాలు, వెలుపటి అలవాట్లను) అనుసరించక ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి నా మనస్సు (సంపూర్ణముగా) మారి (వైఖరులు, ఆదర్శాలు) నూతనమగుటవలన రూపాంతరము పొందుచున్నాను. (రోమా 12:2).

నాకు "ఈ మర్మముయొక్క మహిమైశ్వర్యము ఎట్టిదో అది, అనగా నా యందున్న క్రీస్తు మహిమ నిరీక్షణయై యున్నాడను సంగతిని దేవుడు నాకు తెలియ పరచగోరి యిప్పుడు ఆ మర్మమును నాకు బయలుపరచెను." (కొలస్సీ. 1:27).

దేవుని వలె వాటిని ఉన్నట్టుగా పిలుచుచున్నాను. అయితే చీకటిలో నుంచి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి నన్ను పిలిచిన వాని గుణాతిశయమును ప్రచురముచేయు నిమిత్తము, నేను ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధజనమును, దేవుని సొత్తయిన ప్రజగానున్నాను. (రోమా 4:17, 1 పేతురు 2:9).

నేను దేవునికి చెందిన వాడను కాబట్టి, నన్ను ఆయన స్వకీయ సంపాద్యముగా (ప్రత్యేకమైన సొత్తుగా, సంపదగా) ఏర్పరచుకొనును. తండ్రి తన్ను సేవించు కుమారుని కనికరించునట్టు ఆయన నన్ను కనికరించును. (మలాకీ 3:17).

అపొస్తలుడైన పౌలు వలె, నేనిదివరకే పట్టుకొనియున్నానని తలంచుకొనినను ఒకటి చేయు(నాశించు)చున్నాను. వెనకున్నవి మరచి ముందున్న వాటికై వేగిర పడుచున్నాను.

క్రీస్తు యేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానము పొందవలెనని గురి యొద్దకే పరుగెత్తుచున్నాను. (ఫిలిప్పీ. 3:13,14).

మునుపటి వాటిని జ్ఞాపకము చేసికొనను పూర్వకాలపు సంగతులను తలంచుకొనను. ఇదిగో దేవుడొక నూతన క్రియ చేయుచున్నాడు.

ఇప్పుడే అది మొలచును. కనుక దానిని నేను అర్థము చేసుకొని దానికి తలయొగ్గెదను. ఆయన అరణ్యములో త్రోవ కలుగజేయును. ఎడారిలో నదులు కలుగజేయుచున్నాడు. (యెషయా 43:18,19).

నేను ఆయనకు చెందిన వాడను. కాబట్టి యెహోవా నా అతిక్రమములను తుడిచివేసి యున్నాడు. నా పాపములు ఇక జ్ఞాపకము చేసికొనడు. (యెషయా 43:25).

నేను దేవుని కొరకు ఎదురు చూచుచున్నాను. కనుక నూతన బలము పొంది పక్షిరాజువలె నా రెక్కలు చాపి పైకి (దేవుని దగ్గరకు) ఎగురుదును. అలయక పరుగెత్తెదను. సొమ్మసిల్లక నడిచిపోవుదును. (యెషయా 40:31).

దేవుడు వాగ్దానము చేసిన దానిని నెరవేర్చుటకు సమర్థుడని రూఢిగా విశ్వసించి విశ్వాసము వలన బలము పొందెదను. ఎందుకనగా నా ముందు ఆత్మీయ గమ్యమున్నది. (రోమా 4:21).

## 3వ అధ్యాయము: క్రీస్తుయందు నీ నీతి

ఎందుకనగా నేనాయన యందు దేవుని నీతి అగునట్లు ఆయనను నా కోసము పాపముగా చేయబడెను. (2 కొరింథీ. 5:21).

దేవా నీ నామము ఎంత గొప్పదో, నీ కీర్తియు భూదిగంతముల వరకు అంతగొప్పది. నీ కుడి చెయ్యి నీతి (న్యాయము, మంచితనము)తో యున్నది. (కీర్తనలు 48:10).

నా ప్రభువైన యేసుక్రీస్తు (మెస్సియా) దినమందు నేను నిరపరాధినై యుండునట్లు, అంతము (ప్రభువు దినము) వరకు (నిలకడగా వుంచి, బలము నిచ్చి దోషవిముక్తి చేసి) ఆయన నన్ను స్థిరపరచును. (1 కొరింథీ. 1:8).

నీతి కొరకు (దేవునితో సత్ సంబంధము కొరకు) ఆకలి దప్పులు కలిగిన వారు ధన్యులు. (అదృష్టవంతులు, సంతోషించువారు) వారు తృప్తి పరచ బడుదురు (రక్షింపబడిన స్థితియందు దేవుని దయ, రక్షణను పొందెదరు). (మత్తయి 5:6).

నేను నా భారము (బరువు) యెహోవా మీద మోపెదను. ఆయనే నన్ను ఆదుకొనును. నీతిమంతులను ఆయన ఎన్నటికి (నిత్యమే) కదలనీయడు (పడనివ్వడు, తప్పిపోనివ్వడు, జారనివ్వడు). (కీర్తనలు 55:22).

నా ప్రభువైన యేసును మృతులలో నుండి లేపినవాని యందు విశ్వాస ముంచిన (నమ్మిన, అంటుకొనియున్న, ఆధారపడిన) నాకును ఎంచబడునని నా నిమిత్తము కూడా బైబిలు వ్రాయబడెను. (రోమా 4:24).

కాబట్టి విశ్వాసము మూలముగా నేను నీతిమంతునిగా (నిరపరాధిగా తీర్చబడి దేవునితో సత్సంబంధము కలిగినవాడుగా) తీర్చబడి, నా ప్రభువైన యేసుక్రీస్తు (అభిషక్తుడైన మెస్సీయా) ద్వారా దేవునితో సమాధానము కలిగియుందును. (రోమా 5:1).

నేను యదార్థముగా నీతిగా నడుచుకొనుటను బట్టి నా తదనంతరము నా పిల్లలు ధన్యులగుదురు. (సంతోషవంతులు, అదృష్టవంతులు, కోరదగినవారు). (సామె 20:7).

నేను (నిత్యము) నీతిమంతుడను గనుక నా రక్షణాధారమైన దేవుడు బాధ కలుగునప్పుడు ఆయన నాకు ఆశ్రయ దుర్గముగా నుండును. (కీర్తనలు 37:39).

నాకు విరోధముగా రూపింపబడిన యే ఆయుధమును వర్ధిల్లదు. న్యాయ విమర్శలో నాపై దోషారోపణచేయు ప్రతివానికి నీవు నేరస్థాపన చేసెదవు. యెహోవా సేవకుడైన నా నీతి (న్యాయము, సమాధానము, భద్రత, శత్రువుపై జయము) ఆయన వలన కలుగుచున్నది. ఇది నా స్వాస్థ్యము. ఇది యెహోవా వాక్కు. (యెషయా 54:17).

నేను (నిశ్చయముగా) నీతిమంతుడను కనుక యెహోవా దృష్టి నా మీద ఆయన చెవులు నా మొఱ్ఱలకు ఒగ్గియున్నవి.

నీతిమంతుడైన నేను మొఱ్ఱపెట్టగా యెహోవా ఆలకించి నాశ్రమలన్నిటిలో నుండి నన్ను విడిపించెను.

నాకు (నిత్యము) కలుగు ఆపదలు అనేకములు. వాటన్నిటిలో నుండి యెహోవా నన్ను విడిపించును.

నేను ఆయన సేవకుడను కనుక నా ప్రాణమును విమోచించి ఆయన శరణుజొచ్చిన నన్ను అపరాధిగా ఎంచడు. (కీర్తనలు 34:15,17,19,22).

నేను నీతిగలవాడనై (మంచివానిగా, దేవుని క్రమముననుసరించువానిగా) స్థాపించబడుదును. నేను భయపడనక్కర్లేదు. బాధించువారు నాకు దూరముగా నుందురు. భీతి నాకు దూరముగా నుండును. (యెషయా 54:14).

నేను (నిశ్చయముగా) నీతిమంతుడను గనుక సింహము వలె ధైర్యముగా నుండెదను. (సామెతలు 28:1).

నా ప్రధాన యాజకుడు నా బలహీనతల యందు నాతో సహానుభవము లేనివాడు కాడుగాని, సమస్త విషయములలోను నా వలె శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను.

గనుక నేను నా తప్పుల విషయములో కనికరింపబడి సమయోచితమైన సహాయము (సమయానుకూల సహాయము, యుక్త కాల సహాయము, అవసరమైనప్పుడు కల్గిన సహాయము) కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము (దేవుడు అభాగ్యుల పట్ల దయ చూపించే సింహాసనము) నొద్దకు చేరెదను. (హెబ్రీ. 4:15,16).

కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతునిగా (నిరపరాధిగా, న్యాయవంతునిగా, దేవునితో సత్సంబంధము కలిగినవాడుగా) తీర్చబడి మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదును. (రోమా 5:9).

దుష్ట ఆలోచన చొప్పున నేను నడువక (వారి సలహాలు, తలంపులు, ఉద్దేశాలకనుగుణంగా నడువక) పాపుల మార్గమున నిలువక (వారికి అప్పగించుకొనక) అపహాసకులు కూర్చుండు చోట్లను కూర్చుండక (వారితో విశ్రమొందక).

యెహోవా ధర్మశాస్త్రము నందు ఆనందించుచు దివారాత్రము దానిని (ఆయన కట్టడలు, ఉపదేశములు, బోధలు) ధ్యానించు నేను ధన్యుడను (సంతోషించు వాడను, అదృష్టవంతుడను, మరియు కోరదగినవాడను).

నేను నీటి కాలువల యోరన నాటబడిన వాడనై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుందును. నేను చేయునదంతయు సఫలమగును. (పరిపక్వతకు వచ్చును). (కీర్తనలు 1:1–3).

ఈ ధర్మశాస్త్ర గ్రంథము నా నోటి నుండి తప్పిపోదు. దానిలో వ్రాయబడిన వాటన్నిటి ప్రకారము చేయుటకు నేను జాగ్రత్తపడునట్లు దాని ధ్యానించిన యెడల నా మార్గము వర్ధిల్ల చేసికొని చక్కగా ప్రవర్తించెదను. (యెహొాషువ 1:8).

యెహోవా నామము బలమైన దుర్గము నీతిమంతుడు (మంచివాడు, దేవునితో సత్సంబంధము కలిగినవాడు) అందులోనికి (ఎల్లప్పుడు) పరుగెత్తి సురక్షితముగా నుండును. (సామెతలు 18:10).

అతని (క్రీస్తు) దినములలో నీతిమంతుడైన నేను (నిశ్చయముగా) వర్ధిల్లుదును. చంద్రుడు లేకపోవు వరకు క్షేమాభివృద్ధి కలుగును. (కీర్తనలు 72:7).

ఏలయనగా ఆ దినములైన తరువాత నేను వారితో చేయబోవు నిబంధన (ఒప్పందనము, నూతన నిర్ణయము) ఇదే ఆయన ధర్మ విధులను నా హృదయము నందుంచి నా మనస్సు మీద (అంతరంగయోచన, అవగాహనలపై) వాటిని ఆయన వ్రాయును.

నా పాపములను నా అతిక్రమములను ఇకను ఎన్నటికి ఆయన జ్ఞాపకము చేసికొనడు. వీటి క్షమాపణ (శిక్ష రద్దు, మన్నింపు) ఎక్కడ కలుగునో అక్కడ పాపపరిహారార్థబలి యిక ఎన్నడును వుండదు. (హెబ్రీ. 10:16–18).

ఆయన రక్తము వలన పరిశుద్ధ (అతిపరిశుద్ధ) స్థలమందు ప్రవేశించుటకు నాకు ధైర్యము కలిగియున్నది.

యేసు నా కొరకు ప్రతిష్టించిన మార్గమున అనగా నూతనమైనదియు, జీవము గలదియు (ఆయన శరీరము అను తెర, అతి పరిశుద్ధస్థలమను తెర) ద్వారా యేర్పరచబడిన మార్గమున ఆయన రక్తము వలన పరిశుద్ధ స్థలములోనికి ప్రవేశింతును. (హెబ్రీ. 10:19,20).

ఎందుకనగా నేనాయనయందు దేవుని నీతి (ఆమోదయోగ్యమైన వానిగా సరైన సంబంధము కల్గినవానిగా) అగునట్లు పాపమెరుగని ఆయనను నా కోసము పాపముగా మారెను. (2 కొరింథీ. 5:21).

## 4వ అధ్యాయము: భయమును అధిగమించుట

దేవుడు నాకు శక్తియు, ప్రేమయు, ఇంద్రియ నిగ్రహముగల ఆత్మనే యిచ్చెను గాని పిరికితనము (యిచ్చకపు, భయసంబంధమైన, ధైర్యములేని) గల ఆత్మనియ్యలేదు. (2 తిమోతి 1:7).

నేను యెహోవా యొద్ద విచారణ చేయగా (వాక్యాధికారముచే నా అవసరతనుబట్టి) ఆయన నాకుత్తరమిచ్చెను. నాకు కలిగిన భయములన్నిటిలో నుండి ఆయన నన్ను తప్పించెను. (కీర్తనలు 34:4).

నా హృదయమును కలవరపడనియ్యను, వెరవనియ్యను (ఆందోళన చెందుట నేను అనుమతించుట నిలిపివేయుదును. ఏ భయము కూడా నన్ను అస్థిరునిగా చేయకుండ చూచుకొనెదను). (యోహాను 14:27).

నాకు భయము సంభవించుదినమున నిన్ను ఆశ్రయించుచున్నాను.

దేవుని (సహాయమును) బట్టి నేను ఆయన వాక్యమును కీర్తించెదను, దేవునియందు నమ్మిక యుంచియున్నాను గనుక నేను భయపడను శరీరధారులు నన్నేమి చేయగలరు? (కీర్తనలు 56:3,4).

నేను నీకు తోడైయున్నానని ఆయన నాతో చెప్పియున్నాడు. గనుక నేను భయపడను (భయపడుటకు ఏమియు లేదు). ఆయన నా దేవుడై యున్నాడు. నేను దిగులుపడను. ఆయన నన్ను బలపరచును. నాకు సహాయము చేయువాడు ఆయనే నీతియను తన దక్షిణ హస్తముతో నన్ను ఆదుకొనును. (యెషయా 41:10).

నిన్ను ఏ మాత్రము విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయనని ఆయనే (దేవుడే) చెప్పెను గదా!

కాబట్టి ప్రభువు నాకు సహాయకుడు. నేను భయపడను. నరమాత్రుడు నాకేమి చేయగలడు అని మంచి ధైర్యముతో చెప్పగలవాడనై యున్నాను. (హెబ్రీ. 13:5,6).

నా దేవుడైన యెహోవా భయపడకుము నేను నీకు సహాయము చేసెదనని చెప్పుచు, నా కుడిచేతిని పట్టుకొనుచున్నాడు. (యెషయా 41:13).

దేవుని ప్రేమించిన నాకు అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన నాకు మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగుచున్నవన్న నిశ్చయత నాకు కలదు కనుక నేను భయపడను. (రోమా 8:28).

నన్ను సృజించినవాడగు యెహోవా నన్ను నిర్మించినవాడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు. "నేను నిన్ను విమోచించియున్నాను. భయపడకుము. పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను. నీవు నా సొత్తు. నేను జలములో బడి దాటునప్పుడు ఆయన నాకు తోడైయుండును. నదులలో బడి వెళ్ళునప్పుడు అవి నా మీద పొర్లిపోవు. నేను అగ్నిమధ్యను నడచునప్పుడు కాలిపోను, జ్వాలలు నన్ను కాల్చవు. యెహోవానగు నేను నీకు దేవుడను. ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడనైన నేను రక్షించుచున్నాను. (యెషయా 43:1-3).

భయమునందు హింసకలదు. అయినను భయపడను.

ఆయన యందలి విశ్వాసముచేత ధైర్యమును (నమ్మకము, సాహసము) నిర్భయమైన ప్రవేశము ఆయనను బట్టి నాకు కలిగెను.

కాబట్టి నాకు కలిగిన శ్రమలను చూచి నేను అధైర్యపడను (మూర్ఛిల్లను, భయముచే నిరాశ చెందను). (1 యోహాను 4:18; ఎఫెసీ. 3:12,13).

దేవుడు నాకు ఆశ్రయమును దుర్గమునైయున్నాడు. ఆపత్కాలములో ఆయన నమ్ముకొనదగిన నా సహాయకుడు.

కావున భూమి మార్పునొందినను నడి సముద్రములలో పర్వతములు మునిగినను నేను భయపడను. (కీర్తనలు 46:1,2).

నేను నిబ్బరము కలిగి ధైర్యముగా నుండెదను. దిగులుపడను, జడియను, నేను నడచు మార్గమంతటిలో నా దేవుడైన యెహోవా నాకు తోడై యుండును. (యెహోషువ 1:9).

ఆయనయందు భయభక్తులు గల నా మీదను ఆయన కృపకొరకు కనిపెట్టు నా మీదను యెహోవా కనుదృష్టి ఉన్నది గనుక నేను భయపడను. (కీర్తనలు 33:18).

రేపటిని గూర్చి చింతింపను. రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించను. ఏనాటి కీడు ఆనాటికి చాలును. (మత్తయి 6:34).

నేను సిగ్గుపడనక్కరలేదు. అవమానము తలంచను. నేను లజ్జపడనక్కరలేదు. నేను నా బాల్యపుకాలపు సిగ్గును మరచుదును. నా వైధవ్యపు నిందను ఇక మీదట జ్ఞాపకము చేసికొనను గనుక నేను భయపడనక్కరలేదు. (యెషయా 54:4).

నేను తత్తరిల్లు హృదయము కలిగియుండుటకు శోధింపబడినప్పుడు నాతో నేనీలాగనుకొందును. భయపడక ధైర్యముగా నుండుము. ప్రతిదండన చేయుటకై దేవుడు వచ్చుచున్నాడు. ప్రతిదండనను దేవుడు చేయదగిన ప్రతీకారము ఆయన చేయును. ఆయనే వచ్చి నన్ను రక్షించును. (యెషయా 35:4).

నా అంతరంగ పురుషునియందు శక్తి కలిగి ఆయన ఆత్మవలన బలపరచబడునట్లుగాను క్రీస్తు నా హృదయములో తన మహిమైశ్వర్యమును ఉంచినాడు. కనుక నేను భయపడను. (ఎఫెసీ. 3:16).

నేను యెహోవా యొద్ద విచారణ చేయగా ఆయన నాకుత్తరమిచ్చెను. గనుక ఆయనను కీర్తించి ఘనపరచెదను. నాకు కలిగిన భయములన్నిటిలో నుండి ఆయన నన్ను తప్పించెను. (కీర్తనలు 34:3,4).

ప్రేమలో భయముండదు కనుక నేను అధైర్యపడను. అంతేకాదు పరిపూర్ణ ప్రేమ భయమును వెళ్ళగొట్టును, భయము దండనతో కూడినది. భయపడు నేను ప్రేమ యందు పరిపూర్ణము చేయబడిన వాడను కాను. (1 యోహాను 4:18).

యెహోవా నాకు వెలుగును రక్షణయునై యున్నాడు. నేను ఎవరికి భయపడుదును? యెహోవా నా ప్రాణదుర్గము ఎవరికి వెరతును? నా శరీరమాంసము తినుటకై దుష్టులు నా మీదికి వచ్చినప్పుడు, నన్ను బాధించు శత్రువులు వచ్చినప్పుడు వారు తొట్రిల్లికూలిరి. నాతో యుద్ధము చేయుటకు దండు దిగినను నా హృదయము భయపడదు. దేవుడు నన్ను రక్షించునన్న నమ్మకము నాకు కలదు.

ఆపత్కాలములో ఆయన నన్ను దాచును. శత్రువులకందని ఎత్తైన ఆశ్రయ దుర్గముపై ఆయన నన్నుంచును. అప్పుడు నేను ఉత్సాహధ్వని చేయుచు బలులు అర్పించి ఆయనకు స్తుతిగానము పాడెదను. (కీర్తనలు 27:1-3,5,6).

దేవుని యెదుట తగ్గించుకొనిన ఆ మొదటి దినము మొదలుకొని నేను చెప్పిన మాటలు వినబడినవి గనుక నేను నా మనస్సుయందు భయపడక నుందును. నాకు సమాధానమిచ్చుటకు దేవుడు తన దూతను పంపెను. (దాని. 10:12).

వారు నన్ను సమాజమందిరముల పెద్దల యొద్దకును అధిపతుల యొద్దకును అధికారుల యొద్దకును నన్ను తీసికొనిపోవునప్పుడు నేను ఎలాగు ఉత్తరమిచ్చెదనో ఏమి మాటలాడుదునో అని చింతింపను. (లూకా 12:11).

యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు.

పచ్చికగలచోట్ల ఆయన నన్ను పరుండజేయును. శాంతికరమైన జలముల యొద్ద నన్ను నడిపించును.

నా ప్రాణమునకు సేదదీర్చుచున్నాడు తన నామమును బట్టి నీతి మార్గములలో నన్ను నడిపించుచున్నాడు.

గాడాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడై యుందువు. నీ దుడ్డుకఱ్ఱయు నీ దండము నన్ను ఆదరించును.

నా శత్రువుల యెదుట, నీవు నాకు భోజనము సిద్ధపరచుదువు. నూనెతో నా తల అంటియున్నావు. నా గిన్నె నిండి పొర్లుచున్నది.

నేను బ్రతుకు దినములన్నియు కృపాక్షేమములే నా వెంట వచ్చును. చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను. (కీర్తనలు 23:1-6).

## ముగింపు: నిలకడగా వుండు

ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి నన్ను స్వతంత్రునిగా చేసిన క్రీస్తు కొరకు స్థిరముగా నిలిచి దాస్యమను కాడి క్రింద మరల చిక్కుకొనను. (గలతీ. 5:1).

కాబట్టి నా ధైర్యము విడిచిపెట్టను. దానికి ప్రతిఫలముగా గొప్ప బహుమానము కలుగును.

నేను దేవుని చిత్తము నెరవేర్చిన వాడనై వాగ్దానము పొందు నిమిత్తము నాకు ఓరిమి అవసరమైయున్నది. (హెబ్రీ. 10:35,36).

# గ్రంథ ఆధారాలు

(KJV) గురుతుగల లేఖన ఉదాహరణలు కింగ్‌జేమ్స్ బైబిలు నుండి తీసుకొనబడినవి.

(TLB) గురుతుగల లేఖన ఉదాహరణలు లివింగ్ బైబిల్, 1971, నుండి తీసుకొనబడినవి. టిండేల్ హౌస్, వీటన్, ఇల్లినాయిస్, 60189 వారి అనుమతితో ఉపయోగించబడినవి. సర్వహక్కులు ఇవ్వబడినవి.

(NAS) గురుతుగల లేఖన ఉదాహరణలు న్యూ అమెరికన్ స్టాండర్డ్ బైబిలు నుండి తీసుకొనబడినవి. కాపీరైట్ ద లాక్‌మన్ ఫౌండేషన్, 1960, 1962, 1963, 1968, 1971, 1972, 1973, 1975, 1977 అనుమతితో ఉపయోగించబడినవి.

# రక్షణ కొరకు ప్రార్థన

దేవుడు నిన్ను ప్రేమిస్తున్నాడు మరియు ఆయన నీతో వ్యక్తిగత సంబంధమును కలిగియుండాలని ఆశిస్తున్నాడు. నీవు ఇంకను యేసును నీ స్వంతరక్షకునిగా అంగీకరించని యెడల ఇప్పుడే దానిని చేయుము. మీరు కేవలం మీ హృదయమును ఆయన కొరకు తెరచి ఈ ప్రార్థనను చేయుము.

"తండ్రీ, నేను నీకు వ్యతిరేకముగా పాపము చేసియున్నానని నాకు తెలియును. నన్ను క్షమించుము. నన్ను శుద్ధునిగా చేయుము. నేను మీ కుమారుడైన యేసులో నమ్మికయుంచుదునని వాగ్దానం చేయుచున్నాను. ఆయన నాకొరకు మరణించియున్నాడని - ఆయన సిలువపై మరణించినప్పుడు నా పాపములన్నింటిని ఆయన మోసాడని నేను నమ్ముదును. ఆయన మరణము జయించి తిరిగి లేచాడని నేను నమ్ముచున్నాను. నేను ఇప్పుడే నా జీవితమును యేసుకు అర్పించుచున్నాను.

తండ్రీ, మీ క్షమాపణ మరియు నిత్యజీవమనే బహుమతులను బట్టి మీకు వందనములు. నీ కొరకు జీవించుటకు నాకు సహాయం చేయుము. యేసు నామములో ప్రార్థించుచున్నాను. ఆమేన్."

నీవు నీ హృదయముతో ప్రార్థించినప్పుడు దేవుడు నిన్ను అంగీకరించి, పరిశు ద్ధ పరచి మరియు ఆత్మీయ మరణమనే బంధకము నుండి నిన్ను విడిపించెను, సమయం తీసుకొని ఈ లేఖనములను చదివి మరియు ధ్యానించి మరియు మీ

నూతన జీవితంలో ఆయనతో నడచుచున్న ఈ ప్రయాణంలో దేవుడు మీతో మాట్లాడునట్లు ఆయనను అడుగుము.

- యోహాను 3:16
- 1 కొరింథీ 15:3-4
- ఎఫెసీ. 1:4
- ఎఫెసీ 2:8-9
- 1 యోహాను 1:9
- 1 యోహాను 4:14-15
- 1 యోహాను 5:1
- 1 యోహాను 5:12-13

నీవు క్రీస్తుతో నీ సంబంధముతో ఎదుగుటకు ప్రోత్సహించబడునట్లుగా బైబిలును నమ్మే సంఘమును మీరు కనుగొనునట్లు దేవుని సహాయం కొరకు అడగండి. దేవుడెల్లప్పుడు మీతోనే ఉంటాడు మరియు దేవుడు మీ కొరకు దాచియుంచిన సమృద్ధియైన జీవితమును మీరు జీవించునట్లు ఆయన మిమ్మును నడిపించును.

# రచయితను గురించి

జాయిస్ మేయర్ ప్రపంచంలోని ప్రసిద్ధిగాంచిన క్రియాపూర్వకమైన బైబిల్ బోధకులలో ఒకరు, ఆనందించుడి ప్రతిదిన జీవితం అనే ఆమె టివి మరియు రేడియో కార్యక్రమాలు ప్రపంచమంతటా వందలకొలది టివి నెట్‌వర్క్స్ మరియు రేడియో స్టేషన్స్‌లో ప్రసారమవుతుంది.

జాయిస్ వందల కంటే ఎక్కువ ఉత్తేజకరమైన పుస్తకాలను రచించారు. ఆమె పుస్తకాలలో ఉత్తమంగా అమ్ముడైన పుస్తకాలు – *గాడ్ ఈస్ నాట్ మ్యాడ్ ఎట్ యు; మేకింగ్ గుడ్ హ్యాబిట్స్; బ్రేకింగ్ బ్యాడ్ హ్యాబిట్స్; డు యువర్ సెల్ఫ్ ఎ ఫేవర్. ఫర్‌గివ్; లివింగ్ బియాండ్ యువర్ ఫీలింగ్స్; పవర్ థాట్స్; మనస్సే ఒక రణరంగం; లుక్ గ్రేట్ ఫీల్ గ్రేట్; ద కాన్ఫిడెంట్ వుమన్; ఐ డేర్ యు; మరియు నెవర్ గివ్ అప్!*

జాయిస్ ప్రపంచమంతటా అనేకమంది వేలమంది ప్రజలతో మాట్లాడునట్లు సంవత్సరమంతటా సదస్సులను నిర్వహిస్తూ విస్తారంగా ప్రయాణిస్తూ ఉంటారు.

Joyce Meyer Ministries—India
Post Bag No. 1
Jubilee Hills, Hyderabad
India
www.jmmindia.org

**Go to tv.joycemeyer.org to watch Joyce's messages in a variety of different languages.**

**You can also request Prayer on Toll Free number: 1800 3454 007**

# దేవుడు నీ జీవితాన్ని రక్షించుటకు వేచియున్నాడు!



దేవుడు నిన్ను ప్రేమించుచున్నాడు మరియు నీ పట్ల అద్భుత, మహిమకరమైన ప్రణాళిక కలిగియున్నాడు. దేవుడు నీ పట్ల నిర్దిష్టమైన ఉద్దేశ్యము కలిగియున్నాడని నమ్ముట కొన్నిసార్లు నీకు కష్టమనిపించవచ్చు. గతముచే నీవు గాయపరచబడినట్లైతే లేదా నేను యోగ్యుడను కాను అని నీవు భావించుకున్నట్లైతే, దేవుని షరతులు లేని ప్రేమను పొందుకొనుట నీకు సంకటమనిపించవచ్చు. ఈ దినమున దేవుడు నిన్ను చేరుకోవాలని ఇష్టపడుచున్నాడు. నిరీక్షణను పట్టుకొనుము. నీకు కావాల్సిన జవాబు ఈ పుస్తకమునందు కలదు.

నీ పట్ల నీకున్న భావనను దైవ భావనగా ఎలా మార్చుకోవాలో అన్న విషయాన్ని ఈ పుస్తకమునందు జాయిస్ గారు బయలుపరచుచున్నారు. దేవుడు నిన్ను గూర్చి చెప్పునది నీవు నమ్మినప్పుడు, నీ వర్తమానము భవిష్యత్తు దైవ ఉద్దేశ్యాన్ని అద్భుతంగా ప్రతిబింప చేస్తాయి. భవిష్యత్ కొరకు దేవునిపట్ల నిశ్చయత కలిగియుండుట, భయముపై విజయము సాధించుట అనునవి నీవు నేర్చుకొనెదవు.

దేవుని వాక్యము మీలో పనిచేయుట ప్రారంభించుటకు నేడే అనుమతించండి. గాయపరచ బడిన మీ హృదయాన్ని ఇప్పుడే దేవుడు తన అద్భుతమైన ప్రేమతో ముట్టి స్వస్థపరచునట్లు అనుమతించుట ప్రారంభించండి.

JOYCE MEYER
MINISTRIES®
Sharing Christ – Loving People

Post Bag No. 1, Jubilee Hills,
Hyderabad - 500 033